నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 26-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 77 | పేజీలు: 8 | వెల: రూ.1/-

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

నిజామాబాద్: జిల్లాలోని కోటగల్లి పూలాంగ్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విషాద సంఘటన చోటు చేసుకుంది. కరెంటు తీగలు తెగిపడటంతో విద్యుదాఘాతంతో ఐదవ తరగతి చదువుతున్న ఆయాన్‌ఖాన్(11) బాలుడు మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, విద్యుత్ అధికారులు సంఘటనపై విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని, బాలుడి కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

గోవాలో రెడ్ అలర్ట్

తుపాన్ బీభత్సంలో పర్యాటకులకు హెచ్చరిక

పనాజీ,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): దేశంలోని సొగసైన పర్యాటక కేంద్రంగా పేరొందిన గోవాకు ఇప్పుడున్న పరిస్థితుల్లో పర్యాటకులు ఎవరూ రావద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది. గోవాలోని వాతావరణ హెచ్చరిక కేంద్రం ఈ మేరకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. తుఫాన్ బీభత్సం కారణంగా ప్రస్తుతం గోవాలో భారీ వర్షాలతోపాటు వాతావరణం అల్లకల్లోలంగా ఉందని స్పష్టం చేసింది. అందువల్ల ఇప్పటికే ప్రయాణాలు ఖరారు చేసుకున్నవారు, రావాలని భావిస్తున్న వారు మనసు మార్చుకోవాలని సూచించింది. ముఖ్యంగా ఇప్పటికే గోవాలో భారీ వర్షం కురుస్తోందని, మరో ఐదు రోజులపాటు ఇలాగే వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. జన జీవనానికి ఆటంకం ఏర్పడుతుందని చెప్పారు. అలాగే, సందర్శకుల ప్రధాన ఆకర్షణ బీచ్‌ని, కానీ ప్రస్తుతం కెరటాలు ప్రమాదకరంగా ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయని తెలిపింది. అందువల్ల ఎట్టిపరిస్థితుల్లోనూ సందర్శకు వచ్చేందుకు సాహసించవద్దని గోవా వాతావరణ కేంద్రం డైరెక్టరు కే.వి.పడ్గాల్ వార్ హెచ్చరించారు.

స్టేషన్‌లోనే దారుణం

తుపాకీతో సొంతకొడుకును హత్య చేసిన పోలీస్

లక్నో,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ఓ హెడ్ కానిస్టేబుల్ తన కుమారుడిని పోలీసు స్టేషన్ ఆవరణలో దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని చౌరీ చౌరా పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. అర్విందర్ యాదవ్ అనే హెడ్ కానిస్టేబుల్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారు. అయితే గత కొంత కాలం నుంచి మొదటి భార్యతో గొడవలు ఉన్నాయి. అయితే మొదటి భార్య కుమారుడు పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. దీంతో తండ్రి, కుమారుడి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆవేశంగా ఉన్న కానిస్టేబుల్ అర్విందర్.. తన వద్ద తుపాకీతో కుమారుడిపై కాల్పులు జరిపి హత్య చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అర్విందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తుపాకీని సీజ్ చేశారు.

శనిత్రయోదశితో కలసి వచ్చిన ధనత్రయోదశి

పూజలకు మంచిదని అంటున్న పండితులు

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ఈనెల 26న ధన త్రయోదశితో పాటు శని త్రయోదశి కూడా కలసి వస్తోంది. ఆవేళ మాసశివరాత్రి కూడా నరకచాతుర్ది కూడా ఉంది. తిథి ద్వయం ఆవేళ త్రయోదశి, చతుర్దశి కలసి ఉన్నవి. ఆ వెళ ఇటువంటి మహత్తరమైన దినం ధన త్రయోదశి రోజు మన పెద్దలు చెప్పిన ప్రకారం మనము చేసే దానం, ధర్మం, జపం, తపము, అక్షయము అవును అని పెద్దల వాక్కు ఇటువంటి మహత్తరమైన దినమున శని త్రయోదశి సంభవించుట అరుదైన విషయంగా చూడాలి. ఆ రోజు శనీశ్వర పూజ జరుపుకొనుట వలన అక్షయ ఫలితాన్ని పొందుతారు. ఇకపోతే ఐశ్వర్య ప్రదాయిని అయిన లక్ష్మీదేవి కటాక్షాన్ని పొందే శుభదినం ధనత్రయోదశి. వెలుగు దివ్వెల పండుగ దీపావళికి రెండు రోజుల ముందు జరుపుకునేదీ ఈ ఉత్సవం. ఆ రోజున లక్ష్మీదేవిని పూజిస్తే సకలశుభాలు, అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయని నమ్మకం. అందుకే ప్రతి ఒక్కరూ ధనత్రయోదశి నాడు శక్తికొలది బంగారం కొని లక్ష్మీదేవిని సేవిస్తారు. ఈ నేపథ్యంలో బంగారు దుకాణాలు కళకళలాడుతున్నాయి. భారతీయ సమాజంలో ధనత్రయోదశికి విశేషమైన ప్రత్యేకత ఉంది. ఆశ్వయుజ బహుళ త్రయోదశిని ధనత్రయోదశిగా, యమత్రయోదశిగా జరుపుకుంటారు. ఉత్తర భారతదేశంలో ధనత్రయోదశిని ధనతేరస్‌గా జరుపుకుంటారు. ఈ రోజును ఐశ్వర్య ప్రదాయక రోజుగా వారు భావిస్తారు. ధన త్రయోదశి రోజున ఉత్తర భారతీయులు పలు ప్రత్యేక పూజల ద్వారా లక్ష్మీ అమ్మవారి కటాక్షాన్ని పొందేందుకు ప్రత్యేకమైన రోజుగా భావించి పలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. మహిళల సౌభాగ్యానికి, ఐశ్వర్యానికి ధనత్రయోదశి సూచికగా భావిస్తారు. ఆ రోజున వెండి, బంగారాన్ని కొని ధనలక్ష్మిని అర్చిస్తారు. ఆయుర్వేద వైద్యానికి ఆది పురుషుడైన ధన్వంతరి అవతరించినది కూడా ధనత్రయోదశి రోజునే. క్షీరసాగర మధనంలో మహాలక్ష్మీతో పాటుగా ధన్వంతరి కూడా ఆవిర్భవించినట్లు పౌరాణికగాథ. ప్రతి ధనత్రయోదశి రోజున జ్యూయలరీ దుకాణాల్లో విస్మృతమైన అమ్మకాలు జరుగుతాయి. ధనత్రయోదశి రోజు కోసం నెల రోజుల ముందు నుంచే వినియోగదారులను ఆకర్షించే విధంగా ప్రకటనలు ఇస్తూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. భారతదేశంలో జరిగే మొత్తం బంగారు ఆభరణాల అమ్మకాల్లో ధనత్రయోదశి పర్వదినం సందర్భంగా జరిగే అమ్మకాలు 15 నుంచి 20 శాతం ఉంటాయంటే దీని ప్రభావం ఎంతగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నగరాల్లో ధనత్రయోదశికి సంబంధించి నాలుగు రోజుల క్రితం నుంచే జ్యూయలరీ దుకాణాల్లో సందడి ప్రారంభమైంది. పలు దుకాణాలు ఇప్పటికే ధనత్రయోదశికి ఆఫర్లు ప్రకటించాయి. మేకింగ్ చార్జీలు, తరుగులో ప్రత్యేకంగా రాయితీని ప్రకటించాయి. ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితమని ప్రకటించాయి. వాటితో పాటుగా పలు ప్రత్యేక రాయితీలంటూ నాలుగు రోజులుగా విస్తృతంగా ప్రకటనలు చేస్తున్నాయి. మొత్తం మీద ఈ ఏడాది కూడా ధనత్రయోదశిని పూర్తి స్థాయిలో వినియోగించుకొని వ్యాపారాన్ని పెంచుకునేందుకు జ్యూయలరీ దుకాణాలు పోటీ పడుతున్నాయి. ఏడాది ధనత్రయోదశి ఘడియలు శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభమై శనివారం మధ్యాహ్నం వరకూ ఉంటుందని పండితులు చెబుతున్నారు.

సిఎం కేసీఆర్ వైఖరి దారుణం

ఆర్టీసీ కార్మికుల పొట్టకొట్టేలా వ్యాఖ్యలు
మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెపై తెలంగాణ సీఎం కేసీఆర్ వైఖరిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి తప్పుబట్టారు. ఆర్టీసీ కార్మికుల కడుపుకొట్టి కేసీఆర్ చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు రోడ్డున పడితే ఎకసక్కెంగా మాట్లాడుతూ వారిని అవమానించేలా చేశారని అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చట్టం చేసింది.. అందుకే 50వేల మంది కార్మికులను తొలగిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు ఆర్టీసీ కార్మికుల పొట్టకొట్టమని చెప్పలేదని స్పష్టం చేశారు. కేంద్రం ఏం చెప్పిందో నేరుగా చెప్పకుండా ప్రైవేటీకరణ పేరుతో ఆర్టీసీని భూస్థాపితం చేసేందుకు సిఎం కెసిఆర్ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సొంత ప్రయోజనాల కోసం ఆర్టీసీ సమ్మెను అడ్డుపెట్టుకుని ఆడుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన.. ఇల్లు అలక గానే పండగ కాదని వ్యాఖ్యానించారు. బిజెపిపై నిందలు మోపే ముందు హుజూ ర్‌నగర్‌లో అక్రమాల గురించి మాట్లాడితే మంచిదన్నారు. టిఆర్ఎస్ డబ్బులు వెదజల్లి గెలిచిందన్నారు.

చెడ్డీ గ్యాంగ్ బీభత్సం

వేదపాఠశాలలో చోరీ

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ బీభత్సం సృష్టించింది. కుంట్లూరులోని ఓ వేద పాఠశాలలో చోరబడి 7 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే పసుమములలోని రెండు ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఓ ఇంట్లో మొబైల్, మరో ఇంట్లో కిశోర్‌స్వామి అనే వ్యక్తిని కట్టేసి.. 50వేల నగదు, 11 తులాల బంగారం దొంగిలించారు. 6 గురు దుండగులు చెడ్డీ వేసుకుని వచ్చి రాడ్లతో బెదిరించి దోపిడీకి పాల్పడినట్టు బాధిత కుటుంబాలు తెలిపాయి.

ఢిల్లీ మెట్రోలో ఇద్దరి అరెస్ట్

అక్రమంగా తరలిస్తున్న నగదు పట్టివేత

న్యూఢిల్లీ,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): అక్రమంగా నగదును తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఢిల్లీ మెట్రో స్టేషన్‌లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా వీరు రూ. కోటి నగదును తరలిస్తుండగా సిబ్బంది గుర్తించి పట్టుకున్నారు. నిందితులను రాజస్థాన్‌కు చెందిన వికాస్ చౌహాన్(20), మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన ఆర్(20)గా గుర్తించారు. జంగ్‌పూరా మెట్రో స్టేషన్‌లో వీరి బ్యాగులు స్కాన్‌చేయగా నగదు బయటపడింది. నగదుపై ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదని సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హేమేంద్ర సింగ్ తెలిపారు. నగదును ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

టిక్‌టాక్ మోజులో దొంగలుగా మారిన ఫ్రెండ్స్

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): టిక్‌టాక్ మోజు..ఇద్దరు యువకులను దొంగలుగా మార్చింది. టిక్‌టాక్‌లో వీడియో చేయాలని..అందుకు ఫోన్ల కొనుగోలుకు డబ్బులు లేకపోవడంతో ఫోన్ల స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఎట్టకేలకు ఈ ఇద్దరు పోలీసులకు దొరికిపోయారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ కథనం ప్రకారం..ఛత్రీనాక ప్రాంతానికి చెందిన నరేష్ సినిమా రంగంలో కార్మికుడు. అతని స్నేహితుడు రంగపురం కుమార్ ఆటోడ్రైవర్. ప్రతి రోజు ఈ ఇద్దరు పనులు పూర్తి అయిన తర్వాత మద్యం తాగేవారు. అయితే టిక్‌టాక్ మోజులో పడి..వీడియో తీయడానికి సరైన స్మార్ట్ ఫోన్ లేకపోవడంతో..స్మార్ట్‌ఫోన్‌లను చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల చాంద్రాయణగుట్ట, ఛత్రీనాక పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మొబైల్ ఫోన్‌ల స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదులపై దర్యాప్తు చేసిన దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర బృందం సీసీ ఫుటేజీల ఆధారంగా నరేష్, కుమార్‌లను గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు ఫోన్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆ ఎమ్మెల్యే వద్దు.. గళమెత్తిన ఉమాభారతి

హైదరాబాద్, అక్టోబర్: 25: హర్యానా అసెంబ్లీ ఫలితాలు రసవత్తరంగా వెలుబడిన విషయం తెలిసిందే. బీజేపీ 40 సీట్లతో ఆధిక్యంలో ఉన్నా.. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన బలం లేదు. దీంతో స్వతంత్ర్య ఎమ్మెల్యేలు.. ఇప్పుడు ఆ పార్టీలో చేరుతున్నారు. ఆ జాబితాలోనే ఎమ్మెల్యే గోపాల్ కండా కూడా ఉన్నారు. గతంలో బీజేపీలోనే ఉన్న అతను.. లైంగిక దాడి ఆరోపణలు రావడంతో ఆ పార్టీకి దూరం అయ్యారు. సిర్‌సా నుంచి గెలిచిన గోపాల్ కండా ఇప్పుడు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాడు. మద్దతు ఇస్తానంటూ ముందుకు వచ్చాడు.

కానీ ఆ పార్టీ మహిళా నేతలు ఆ ఎమ్మెల్యేను తీసుకోవద్దు అంటూ తమ అభిప్రాయాన్ని వినిపిస్తున్నారు. హర్యానాలో ప్రభుత్వ ఏర్పాటును సమర్థిస్తున్నా.. గోపాల్ లాంటి ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకోరాదు అని సీనియర్ నేత ఉమాభారతి ట్వీట్ చేశారు. పార్టీలో మోదీ లాంటి శక్తివంతమైన నేత ఉన్నప్పుడు .. గోపాల్ లాంటి ఎమ్మెల్యేలు ఎందుకు అని ఆమె ప్రశ్నించారు. రేప్ ఆరోపణలు ఎదుర్కొంటున్న గోపాల్ కండాను బీజేపీ స్వాగతిస్తోందని, అంటే ఆ పార్టీకి మహిళల భద్రత పట్ల చిత్తశుద్ధి లేదని మహిళా కాంగ్రెస్ నేత సుష్మితా దేవ్ విమర్శించారు. 90 సీట్లు ఉన్న హర్యానాలో కాంగ్రెస్ 31, జేపీపీ 10 సీట్లు నెగ్గాయి. బీజేపీకి చెందిన 8 మంది మంత్రులు ఓటమిపాలయ్యారు.

అశ్వత్థామరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన డ్రైవర్...

హైదరాబాద్, అక్టోబర్ 25: ఆర్టీసీ జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డిపై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కూకట్‌పల్లి డిపోకు చెందిన కోరేటి రాజు అనే డ్రైవర్ ఫిర్యాదు చేశాడు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ తో కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటూ.. వారి ఆత్మహత్యకు అశ్వత్థామరెడ్డి కారణమవుతున్నాడని డ్రైవర్ ఆరోపించాడు. కార్మికుల కోసం కొట్లాడేందుకు చాలా మంది నాయకులు ఉన్నారు. సీఎం కేసీఆర్ నిన్న మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. డ్రైవర్లు, కండక్టర్లు డ్యూటీల్లో జాయిన్ అయితే తమకు అభ్యంతరం లేదని.. ఇష్టమున్న వారు దరఖాస్తు పెట్టుకోవచ్చని సూచించారని.. అందుకనుగుణంగా అందరూ విధుల్లో చేరాలని రాజు పిలుపునిచ్చారు.ప్రభుత్వానికి మన కోరిక వినిపించడానికి రెండు మూడు రోజులు సమ్మె చేయాలి, కానీ నెలల తరబడి సమ్మె చేయడం భావ్యం కాదని తెలిపారు. అశ్వత్థామరెడ్డి వంటి నాయకులకు సత్తా ఉంటే ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి, రాష్ట్రపతి వద్దకు వెళ్లి డిమాండ్లు సాధించాలి, కానీ కార్మికులను విధులకు వెళ్లద్దనడం సమంజసం కాదన్నారు. నాయకుల మాటలు విని కుటుంబాలను నాశనం చేసుకోవద్దు. మనకు అన్నం పెట్టిన సంస్థ ఆర్టీసీని కాపాడుకోవాలని తోటి కార్మికులకు డ్రైవర్ రాజు విజ్ఞప్తి చేశాడు.

హరియాణాలో ప్రభుత్వ ఏర్పాటు దిశగా బిజెపి

అనూహ్యంగా స్వతంత్రుల మద్దతు
వేగంగా పావులు కదిపిన కమలదళం

న్యూఢిల్లీ,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): హరియాణాలో తిరిగి పాలనా పగ్గాలు చేపట్టేందుకు బీజేపీ సంసిద్ధమైంది. మేజిక్ ఫిగర్‌కు ఆరు సీట్లు అవసరమైన క్రమంలో పాలక బీజేపీకి మద్దతు ఇచ్చేందుకు స్వతంత్ర ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని హర్యానా లోక్‌హిత్ పార్టీ చీఫ్, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే గోపాల్ కందా చెప్పారు. బీజేపీకి బేషరుతు మద్దతు ఇచ్చేందుకు ఆరుగురు ఇండిపెండెంట్లు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. 90 మంది సభ్యులు కలిగిన హరియాణా అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 46 మంది ఎమ్మెల్యేలు అవసరం కాగా బీజేపీ 40 మంది సభ్యులకే పరిమితమైంది .కాంగ్రెస్ 31 స్థానాల్లో, జేజేపీ 10 స్థానాలు, ఇతరులు 9 స్థానాల్లో గెలుపొందారు. హరియాణా అసెంబ్లీలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని 8 మంది ఇండిపెండెంట్లను ఆశ్రయించింది. బీజేపీ అగ్రనాయకత్వంతో చర్చించేందుకు హరియాణా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ ఢిల్లీ చేరుకున్నారు. తాము హరియాణాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు పది స్థానాలు పొందిన జేజేపీ చీఫ్ దుష్యంత్ చౌతాలా మద్దతు కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. హరియాణాపై ఆశలు వదులుకోలేదని ఆ పార్టీ నేత, మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా పేర్కొనడం గమనార్హం. ఇకపోతే బీజేపీకి తన మద్దతు ఇస్తున్నట్లు హర్యానాలోని రనియా అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే రంజిత్ సింగ్ తెలిపారు. ఢిల్లీలోని హర్యానా భవన్ లో ఆయన మీడియాతో బీజేపీకి మద్దతిస్తున్న విషయాన్ని తాను బాహాటంగానే చెప్పానని వెల్లడించారు. మరోవైపు హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ హర్యానా భవన్ కు చేరుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా, బీజేపీ హర్యానా ఇన్ ఛార్జి అనిల్ జైన్ తో సమావేశం కానున్నారు. హర్యానాలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయన ఢిల్లీలో మకాం వేసి బీజేపీ సీనియర్ నాయకులతో మంతనాలు చేస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణపై బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డాతో ఆయన సమాలోచనలు చేస్తున్నారు. మెజార్టీకి ఆరు స్థానాల దూరంలో నిలిచిన ఖట్టర్ ఈ మేరకు జేపీపీ, స్వతంత్ర అభ్యర్థుల మద్దతు కూడకట్టేందుకు ప్రయత్నాలు ఆరంభించారు. ఈ ఎన్నికలలో కీలకంగా మారిన జనా యక్ జనతాపార్టీ పది సీట్లు సాధించింది. పార్టీ అధినేత దుశ్యంత్ చౌతాలా కూడా తన పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఈ మేరకు మీడియా సమావేశం ఏర్పాటుచేసి తన నిర్ణయాన్నా వెల్లడించనున్నట్లు తెలిపారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 90 స్థానాలకు గానూ బీజేపీ 40 చోట్ల విజయం సాధించింది. ప్రభుత్వ ఏర్పాటుకు 46 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. దీంతో స్వతంత్ర ఎమ్మెల్యేలు సహా మరికొందరు ఎమ్మెల్యేలు ఇతరుల మద్దతు ఉన్నట్టు చెబుతున్నారు. కాగా 40 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచిన తమనే ముందు ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ ఖట్టర్ రాష్ట్ర గవర్నర్ సత్యదేశ్ నారాయణ్ ఆర్యను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీపై కేసీఆర్ దుర్మార్గపు ప్రకటన

ఆయన వ్యాఖ్యాలు అహంకారానికి పరాకాష్ట
ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా మరింతగా పోరాడుతాం
కోర్టులను లెక్కచేయని స్థితిలో కెసిఆర్
అఖిలపక్ష భేటీలో మండిపడ్డ కోదండరామ్, తమ్మినేని తదితరులు

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కథ ముగిసిందంటూ సిఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు దుర్మార్గానికి పరాకాష్ట అని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. ప్రశ్నలు అడిగే వారిని దబాయించారు తప్ప సమాధానం చెప్పలేదన్నారు. ఆర్టీసీకి చట్టప్రకారం ఇవ్వాల్సిన దాని కంటే తక్కువ ఇచ్చారని ఆరోపించారు. కార్మికులు అవార్డులు తెచ్చారంటూనే.. నష్టాలకు కారణమంటున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ వీధి నాయకుడిలా మాట్లాడారని ధ్వజమెత్తారు. కేసీఆర్ తన వ్యాఖ్యలతో అందరినీ ఏకం చేసేలా మాట్లాడారన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజకీయ జేఏసీ సమావేశం నిర్వహించారు. అఖిల పక్ష నాయకులుంతా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కోదండరాం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి దుర్మార్గానికి నిన్నటి ప్రెస్‌మీట్ పరాకాష్ట అని దుయ్యబట్టారు. ప్రశ్నలు అడిగే వారిపై ముఖ్యమంత్రి దబాయించారు కానీ సమాధానం చెప్పలేదని మండిపడ్డారు. సమావేశంలో సీఎం అన్ని అసత్యాలు, అర్ధ సత్యాలే మాట్లాడారని, వీధి నాయకుడి తరహాలో కేసీఆర్ మాట్లాడారని ఆరోపించారు. ఇకనైనా అన్ని పక్షాలు ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్టీసీ లేకపోతే వచ్చే నష్టాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అలాగే సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమం వదిలి ప్రైవేట్ సంస్థ యజమానిలా మాట్లాడారన్నారు. తె ప్రజల పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సామాన్య జనాలకు ఆర్టీసీ తప్ప వేరే మార్గం లేదన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్య కాదు.. ప్రజలకు అవసరమైన వ్యవస్థ అన్నారు. అన్నిపక్షాలు ఏకతాటిపైకి రావాలని, గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీసీ లేకపోతే వచ్చే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. అసత్యాలు.. అర్ధ సత్యాలే కేసీఆర్ మాట్లాడారన్నారు. ప్రశ్నలు అడిగితే సమాధానం చెప్పపోగా.. దబాయించి మాట్లాడారన్నారు. ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపే క్రమంలో తమపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని, అరెస్టు సందర్భంగా దాడిని ఖండిస్తున్నామని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ వ్యాఖ్యానించారు. ఆర్టీసీకి చట్ట ప్రకారం ఇచ్చే దాని కంటే చాలా తక్కువ ఇచ్చారని, ఆర్టీసీ నష్టాలకు కారణం కార్మికులే కారణం అనడం దురదృష్టకరమన్నారు. పేదవారి రవాణాకు ఆర్టీసీ తప్ప వేరే మార్గం లేదని, ప్రజల పట్ల ప్రభుత్వ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ప్రజా సంక్షేమం వదిలి కేసీఆర్ ప్రైవేటు సంస్థ యజమానిలా మాట్లాడారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో అందరినీ ఏకం చేసేలా మాట్లాడారని, అన్ని పక్షాలు ఏకతాటిపైకి రావాలని కోదండరాం పిలుపునిచ్చారు. ద్రోణాచార్యుడు ఏకలవ్యుడి బోటన వేలు గురుదక్షణ తీసుకున్నట్టు..కుట్రపూరితంగా దొర కేసీఆర్ దక్షిణగా రంగారావు వేలు తీసుకున్నాడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. సీపీఐ ఎమ్ఎల్ కేసీఆర్‌తో కలిసి పోరాటం చేసిన పార్టీ అని, ఉద్యమ సమయంలో ఖమ్మం ఆస్పత్రిలో కేసీఆర్‌కు అండగా ఉన్నది పోటు రంగారావేనని గుర్తు చేశారు. బోటనవేలు దెబ్బకు ప్రతికారం తీర్చుకుంటామని, సమ్మెను ముందుకు తీసుకెళ్తామన్న కార్మికులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేసామన్నారు. ఆర్టీసీని మింగే పనిలో కెసిఆర్ మాట్లాడారని అన్నారు. వారికి జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేవంటూ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా, కోర్టు మాటలు పట్టించుకునే అవసరం లేనట్టు మాట్లాడారు. యూనియన్లను సహించం..దరకాస్తులు చేసుకుంటే ఉద్యోగులను చేర్చుకోవడంపై ఆలోచిస్తా అని అంటున్నారు. మోటారు వాహన చట్టం అమలు చేస్తామనడం విజ్ఞత గల ముఖ్యమంత్రికి తగదు. హుజూర్‌నగర్ విజయంతోనే ఇలా గర్వంతో మాట్లాడు తున్నారు. ఆర్టీసీనే కాదు టీఎన్జీవో, టీజీవో లు భ్రమలో ఉన్నారు. యూనియన్‌లు నన్నే మీ చేయడం లేదన్నట్టుగా మాట్లాడారని కెసీఆర్ మాట్లాడిన తీరుపై తమ్మినేని మండిపడ్డారు.

పోలీసుల చర్యను చరిత్ర క్షమించదు

పోటు రంగారావు వేలుపోయేలా చేసిన కేసీఆర్ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రాణాలైనా ఇవ్వడానికి సద్ధమై ఆర్టీసీ పోరాటంలోకి దిగామని, కార్మికుల పట్ల పోలీసుల చర్యలను చరిత్ర క్షమించబోదని పేర్కొన్నారు. ఉద్యమకారుల పట్ల వ్యవహరించాల్సిన తీరు ఇది కాదని, రేపటి నుంచి నిరవధిక దిక్ష చేయనున్నట్లు ఆయన తెలిపారు.

తెలంగాణ వచ్చాక హిట్లర్, నిజాం వాదంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగిస్తున్నారని సీపీఐ ఎంఎల్ సహాయ కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. హుజూర్‌నగర్ గెలుపు ధీమాతో మాట్లాడిన మాటలు రాజ్యాంగ వ్యతిరేకమని కొట్టిపారేశారు. కార్మికుల ఉద్యమాన్ని చెడగొట్టేందుకే ఈ వ్యాఖ్యలు చేసారని, ధన.. అధికార బలంతో హుజూర్‌నగర్ ఎన్నికలు జరిగాయని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఎమ్జంగ్ ÷న్సీ వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలను బానిసలుగా మర్చే ప్రమాదం ఉందని ఆరోపించారు. ప్రశ్నించే సమాజాన్ని కేసీఆర్ భరించలేక పోతున్నారని, ఆదే ఆయన పరిపాలించేందుకు అర్హుడు కాదన్నది తేలిందన్నారు. ఉడుత బెదిరింపులకు కార్మికులు భయపడరని ఎద్దేవా చేశారు. పశువులను తీసుకెళ్లే వ్యాన్‌లో ఉద్యమకారులను తరలిస్తున్నారని మండిపడ్డారు. నరహంతక విధానాలను ఎదిరించి పోరాటం కొనసాగిస్తామని, యూనియన్ లకు వ్యతిరేకంగా మాదుతున్న కేసీఆర్ తీరును ప్రతిగటించాలని ఆయన పిలుపునిచ్చారు.

హుజూర్‌నగర్ ఓటమితో ఉత్తమ్ పదవికి ఎసరు

త్వరలోనే పిసిసి మార్పు అంటున్న కాంగ్రెస్ నేతలు
పదవి కోసం పార్టీలో పెరుగుతున్న పోటీ

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): హూజూర్‌నగర్‌లో కాంగ్రెస్ ఘోర పరాభవంతో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కు కొత్త ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఇప్పటికే పీసీసీ మార్పు అంశంపై పార్టీలో జోరుగా చర్చ సాగుతోంది. ఈఫలితంతో ఇక

ఇది కేవలం తమ లాభాల కోసమే...

'ప్రపంచీకరణ'– గ్లోబలైజేషన్– పేరుతో జరిగిపోతున్న అనేక ఘోరాలలో, ఆర్థిక నేరాలలో భూ బకాసురత్వం' అతి ప్రధానమైనది. కానీ ఘోరాలు నేరాలు అక్రమాలు సక్రమమై పోవడం, చట్టబద్ధమై పోవడం 'మార్కెట్ ఎకానమీ' సృష్టిస్తున్న మాయాజాలంలో భాగం. మార్కెట్ ఎకానమీ– స్వేచ్ఛా విపణి వ్యవస్థ– ఏర్పరచిన 'అంతర్జాతీయ కృత్రిమ అనుసంధానం' ఫలితంగా విదేశాల నుంచి 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు'– మల్టీ నేషనల్ కంపెనీలన్నీ మన దేశంలోకి చొరబడిపోయాయి. ఈ దోపిడీ సంస్థలకు వందల, వేల, లక్షల ఎకరాల వ్యవసాయ భూమిని, అటవీ భూమిని కట్టబెట్టడం పాతికేళ్లకు పైగా ప్రభుత్వాల ప్రధాన కార్యక్రమం అయిపోయింది. ప్రజల సమష్టి హితానికి ప్రభుత్వం నిర్వహించే పథకాల కోసం అటవీ భూమిని కేటాయించడం, వ్యవసాయ భూమిని సేకరించడం ఒకటిన్నర శతాబ్దులకు పైగా ఈ దేశంలో నడిచిన కథ. వాణిజ్య సంస్థలు తమకు కావలసిన భూమిని తమంతతాము కొనుగోలు చేసుకోవలసి వచ్చేది.

ప్రభుత్వేతర వాణిజ్య పారిశ్రామిక సంస్థల లక్ష్యం ప్రధానంగా తాము లాభాలను ఆర్జించడం మాత్రమే, ప్రజల సమష్టి హితం ఈ సంస్థల లక్ష్యం కాదు, కాలేదు. స్వదేశీయ వాణిజ్య సంస్థలకు ఈ దేశం పట్ల మమకారం ఉంది, జాతీయతా నిష్ఠ ఉంది. ఇది సాధారణ నియమం. ఈ 'నిష్ఠ', మాతృదేశ మమకారం లేని విద్రోహులు వాణిజ్య పారిశ్రామిక వేత్తలలో ఉన్నారు. ఇది అపవాదం.

అంతర్జాతీయ అనుసంధానం ఫలితంగా దేశంలోకి చొరబడిన విదేశీయ సంస్థలకు ఈ దేశం పట్ల మమకారం సహజంగానే లేదు. తక్కువ పెట్టుబడులతో ఈ దేశ ప్రజల నుండి ఇబ్బడిముబ్బడిగా లాభాలను సంగ్రహించుకొని తమ దేశాలకు తరలించుకొని వెళ్లడం ఈ విదేశీయ సంస్థల లక్ష్యం! ఇలాంటి విదేశీయ సంస్థలకు, బహుళ జాతీయ సంస్థలకు ప్రభుత్వాలు నడుములను బిర్రుగా బిగించుకొని ప్రజల నుండి భూమిని సేకరించి పెట్టవలసిన అవసరం లేదు. ఆయా విదేశీయ సంస్థలు కాని, స్వదేశీయ వాణిజ్య సంస్థలు కాని తమ పరిశ్రమల స్థాపన కోసం లేదా వ్యాపార కలాపాల కోసం వలసిన భూములను ప్రభుత్వం నుంచి కాని వ్యవసాయదారుల నుంచి కాని కొనుగోలు చేసుకోవాలి. ఈ కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వాల జోక్యం ఉండరాదు. విదేశీయ సంస్థలు మన దేశంలో పరిశ్రమలను పెడుతున్నది, సేవలను అందిస్తున్నది మన దేశ ప్రజలను ఉద్ధరించడానికి కాదు, కేవలం తమ లాభాల కోసమే.

కానీ ప్రపంచీకరణ మొదలైన తరువాత మన ప్రభుత్వాలు మన దేశంలో పెట్టుబడులకోసం వెంటపడటం ఆరంభమైంది. ఇలా పెట్టుబడులను మోసుకొని వస్తున్న వారికోసం ప్రభుత్వాలు కారుచౌకగా భూమిని సేకరిస్తున్నాయి, విద్యుత్తును ఇంధనాన్ని దాదాపు ఉచితంగా సరఫరా చేస్తున్నాయి. ఏళ్లతరబడి సకలవిధ శుల్కాల నుంచి సుంకాల నుంచి ఈ విదేశీయ సంస్థలకు మినహాయింపులను ఇస్తున్నాయి. ఇందులో భాగంగానే 1894నాటి భూమి సేకరణ చట్టం'కింద వ్యవసాయదారుల నుంచి భూమిని లాక్కొని పారిశ్రామికవేత్తలకు సమర్పించడం మొదలైంది. ఈ బ్రిటన్ దురాక్రమణ నాటి చట్టం కాలదోషం పట్టిందని సర్వోన్నత న్యాయస్థానం పదే పదే వ్యాఖ్యానించడం 2013లో ప్రభుత్వం కొత్తగా భూమి సేకరణ చట్టాన్ని చేసింది.. ఇదంతా చాలదన్నట్టు 2005–2006 నుంచి అమలు జరుగుతున్న 'ప్రత్యేక ఆర్థిక మండలుల' చట్టం మన వ్యవసాయ భూమికి 'చీడ'లాగా తయారైంది, మన అడవుల పాలిట 'గొడ్డలి'గా మారింది. ఈ చట్టం ప్రకారం జరుగుతున్న లక్షల ఎకరాల భూమి సేకరణ కార్యక్రమం ఆకుపచ్చని అడవులలో చిచ్చుపెట్టింది, వ్యవసాయ భూములను రక్తసిక్తం చేసింది. 'పోస్కో' 'వేదాంత' 'లావాసా' ''డీబీర్స్' 'అరేనా'వంటి సంస్థల పారిశ్రామిక ప్రాంగణాల ఏర్పాటుకు వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల వారు రైతుల కళ్ల ఎదుటనే వరి పొలాలకు నిప్పుపెట్టడం చరిత్ర. తమలపాకుల తోటలను, కాచేపూచే ఫల వృక్షాలను నరికివేయడం చరిత్ర! ఎలాంటి రాయితీలను కల్పించకపోయినప్పటికీ వ్యాపారం చేసుకొని లాభాలను ఆర్జించదలచే విదేశీయ సంస్థలు మన దేశంలో పెట్టుబడులను పెడతాయి. కానీ మన ప్రభుత్వాలు ఎపుడైతే పెట్టుబడులకోసం వెంటపడటం మానేస్తారో అపుడు విదేశీయులు కూడా మనల్ని పట్టించుకుంటారేమో.. ఆలోచించాలి.

కేసీఆర్ పట్ల ప్రజల్లో అచంచల విశ్వాసం

తన గెలుపునకు అదే ప్రధాన కారణం

మేళ్లచెరువు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన సైదిరెడ్డి

సూర్యాపేట,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ప్రజలకు తాము చేరువగా ఉంటూ,నిత్యం అందుబాటులో ఉండడంతో పాటు తమ బ్రాండ్ ఇమేజ్గాఉన్నకెసిఆర్ వల్లనే హుజూర్నగ్లో ఘన విజయం సాధించగలిగానని విజేత శానంపూడి సైదిరెడ్డి అన్నారు. కెసిఆర్ పట్ల ప్రజల్లో విపరీతమైన క్రేజ్ ఉండడంతో పాటు తెలంగాణ స్ఫూర్తిప్రదాతగా నిలిచిపోయారని అన్నారు. తామెంతగా శ్రమించినా ఆ ఇమేజ్ తనను మరింతగా ముందు తీసుకుని వెళ్లడం వల్లనే ఘనవిజయం సాధ్యమైందన్నారు. శుక్రవారం ఆయన మేల్లచెరువు శంభుదేవిని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయంలో స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విజయం కాంగ్రెస్కు గుణపాఠం కావాలన్నారు. ఉత్తమ్ ఒంటె÷–తతు పోకడలతో పాటు, విపక్షాలను ప్రజలు నమ్మలేదన్నారు. బిజెపికి ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని అన్నారు.

కుట్రలెన్నో ఛేదించి హుజూర్నగర్ ఉప ఎన్నికలో ప్రజలందరి ఆశీర్వాదంతో అఖండ విజయాన్ని సాధించినట్లు వెల్లడించారు. 60 ఏళ్ల నిర్లక్ష్య పాలనను ఎండగట్టి కేవలం ఐదేళ్లలోనే అన్ని రంగాలను ఎవరూ ఊహించని రీతిలో సాధించిన అభివృద్ధితోచిరునామాగా మారిన టీఆర్ఎస్ పార్టీకే హుజూర్నగర్ ప్రజలు పట్టం కట్టడం కెసిఆర్ పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసమే కారణమని అన్నారు. విపక్షాలన్నీ ఏకమైనా టీఆర్ఎస్ పార్టీని ఢీకొట్టలేక ఘోర పరాజయం పాలయ్యారని అన్నారు. కాంగ్రెస్ నాయకుల అహంకారానికి ఈ విజయం చెంపపెట్టుగా మారిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్పై విశ్వాసానికి ప్రతీకగా ప్రజలంతా ఏకమై గులాబీ జెండాకే జై కొట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు.కాంగ్రెస్, బీజేపీలు ఏకమై టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులు పెట్టినా సంయమనం పాటించి గెలుపే లక్ష్యంగా చివరి నిముషం వరకు పని చేశారన్నారు. నోటికి వచ్చినట్లు ప్రతిపక్షాలు అడ్డగోలుగా మాట్లాడినా.. పదవీ వ్యామోహంతో అర్థంలేని ఆరోపణలు చేసినా, ప్రజలంతా ఏకపక్షంగా నిలిచి టీఆర్ఎస్ పార్టీని గెలిపించి ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై సిద్ధాంతాలను వదిలి కుయుక్తులు పన్నినా అంతిమ విజయం టీఆర్ఎస్కే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా చెప్పుకున్న నాయకులకు అది కంచుకాదని రుజువు చేశారని అన్నారు. పనిచేసే వారికి పట్టం కట్టాలన్న ప్రజల ఆకాంక్ష మేరకు తన విజయం ఖాయమైందని సైదిరెడ్డి చెప్పారు. సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో అన్ని క్యాడర్లు సమన్వయంతో పనిచేశామని, ఆ కృషి ఫలితం..అభివృద్ధి సంక్షేమ పథకాల మంత్రాలే ఈ విజయానికి నాంది అన్నారు. ఈ విజయంలో సీఎం కేసీఆర్పై ప్రజలు అచంచలమైన విశ్వాసాన్ని చాటారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకే ప్రజలు జైకొట్టారని, ఇక ముందు జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇటువంటి ఫలితాలే పునరావృతం అవుతాయన్నారు. ఈనెల 26న సాయంత్రం 4గంటలకు హుజూర్నగర్లో నిర్వహించనున్న కృతజ్ఞత సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. హుజూర్నగర్ ప్రజల సమస్యలపై ఆ సభలో ప్రసంగిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఉప ఎన్నిక దెబ్బతో కాంగ్రెస్ పీడ విరగడైందని, కాంగ్రెస్ కంచుకోటలు బద్దలు చేశామన్నారు. ప్రజలు అభిమానం చాటుతూ సీఎం కేసీఆర్ వెంట నడిచి తిరుగులేని విజయం అందించారన్నారు. ఈ విజయంతో ఇక హుజూర్నగర్ దశ తిరుగుతుందని, అభివృద్ధి ముఖద్వారంగా మారనుందన్నారు. విజయం కోసం కసితో కృషి చేసిన టీఆర్ఎస్ శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హుజూర్నగర్ ప్రజలు గొప్ప తీర్పునిచ్చారని, కాంగ్రెస్ అహంకారానికి అసత్య ప్రచారాలకు ప్రజలు చెంపపెట్టుగా విజ్ఞతతో విజయాన్ని అందించారని అన్నారు. ఈ విజయం ప్రతిపక్ష పార్టీలకు చెంపపెట్టులాంటిదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై టీఆర్ఎస్ పార్టీని వేధించారని, అయిన ప్పటికీ అంతా ఓపికగా టీఆర్ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేశారన్నారు. ప్రజలు అన్ని గమనించి గొప్ప విజయాన్ని టీఆర్ఎస్కు అందించారన్నారు. హుజూర్నగర్ అభివృద్ధి కోసం వచ్చిన ఈ ఎన్నికల్లో ప్రజలు చాలా గొప్పగా తీర్పునిచ్చి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించిన హుజూర్నగర్ ప్రజలందరికీ రుణపడి ఉంటానని శానంపూడి సైదిరెడ్డి అన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల ఆకాంక్షను నెరవేర్చుతానన్నారు. హుజూర్నగర్ సమగ్రాభివృద్ధికి పాటుపడుతానన్నారు. చెప్పిన ప్రతి మాటకు కట్టుబడి హామీలన్నీ నెరవేరుస్తానని, అందరి సహకారంతో హుజూర్నగర్ను అభివృద్ధికి ముఖ ద్వారంగా మారుస్తానని చెప్పారు.

పండుగ వేళ.. దేశవ్యాప్తంగా ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్,అక్టోబర్ 5: దీపావళి, క్రిస్మస్ పండుగ సీజన్ నేపథ్యంలో.. భారతీయ రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడపనున్నది. సుమారు 200 ప్రత్యేక రైళ్లు.. దాదాపు 2500 అదనపు ట్రిప్పులు తిరుగుతాయని రైల్వేశాఖ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ప్రయాణికుల తాకిడిని తట్టుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. ఢిల్లీ నుంచి పాట్నా, కోల్కతా, ముంబై, లక్నో, గోరక్పూర్, చాప్రా స్టేషన్లకు ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. వివిధ రైల్వే జోన్లలోనూ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. రిజర్వేషన్ లేని బోగీల వద్ద ప్రయాణికులను క్యూ పద్ధతిలో పంపేందుకు ఆర్పీఎఫ్ ప్రత్యేక చర్యలు తీసుకున్నది. అన్ని ముఖ్య స్టేషన్లలో హెల్ప్ డెస్క్లు పనిచేయనున్నాయి.

బిజెపికి చెంపపెట్టు ఫలితాలు

హైదరాబాద్, అక్టోబర్ 25: మహారాష్ట్ర,హర్యానా ఎన్నికల్లో బిజెపికి అంత సులువుగా విజయమేమీ సాధ్యం కాలేదు. ఈ రెండు రాష్ట్రాల ఫలితాలను తీసుకుంటే ప్రజాగ్రహం కోడా అంతర్లీనంగా కానవస్తుంది. కేవలం 370 ఆర్టికల్ రద్దు, ట్రిబుల్ తలాక్ వంటి అంశాలను మాత్రమే ప్రజలు సానుకూలంగా చూడలేదని గమనించవచ్చు. జిఎస్టీ,నోట్ల రద్దు తరవాత ఆర్థిక మందగమనం ప్రభావం సామాన్యులపై తీవ్రంగా ఉంది. నిరుద్యోగం పెచ్చుమీరుతోంది. ధరలు సవాల్ చేస్తున్నాయి. ఉల్లిపాయల ధర వందదాకా వెళ్లి మెల్లగా ఇప్పుడు 50 వద్దకుచేరుకుంది. ధరల మోతతో సామాన్యులకు ఇక్కట్లు తప్పడం లేదు. అలాగే ఆర్థిక దివాళా కారణంగా ఇప్పుడు స్వయం ఉపాధి పథకాలు మూలన పడుతున్నాయి. సొంతంగా వ్యాపారం చేసుకునే పరిస్థితి లేదు. బ్యాంకుల తీరు సామాన్యులకు ఇక్కట్లు కలుగచేసేదిగా ఉంది. ఈ సమస్యలను పక్కన పెట్టి బిజెపి కేవలం జాతీయవాదం, దేశవ్యాప్త ఎన్నార్సీ, 370 అధికరణ, సావార్కర్, శివాజీ ఇలా అనేకానేక అంశాలను ముందుకు తీసుకుని వచ్చింది. దీంతో ప్రజలు ఈ ఎన్నికల్లో తమదైన శైలిలో ఓ మెచ్చరిక చేశారు. అందుకే స్థానికాంశాల జోలికి పోక ండా వీటిచుట్టూ అత్యధిక ఓట్లు నెగ్గుకురావాలన్న బీజేపీ వ్యూహం ఫలించలేదు. ఈ రెండు రాష్ట్రాల్లో ఒక్క ఎన్నికల సభలో కూడా పాల్గొనని సోనియాగాంధీకీ, కాంగ్రెస్కు ఈ ఫలితాలు కచ్చితంగా ఉత్తేజాన్ని చ్చాయి. మరిన్ని రాష్ట్రాలను తన ఖాతాలో తహత హలాడుతున్న బీజేపీకి ముందుముందు పరిస్థితి అంత ఈజీ కాదని గుర్తుంచు కోవాలి. పై మెరుగులతో ప్రజలను ఎంతో కాలం మభ్య పెట్టలేమని గుర్తించాలి.

మహారాష్ట్రలో బీజేపీ – శివసేన కూటమి ఘన విజయం సాధించినా ఘనవిజయంగా చెప్పుకోవడానికి లేదు. గత ఎన్నికలతో పోలిస్తే అక్కడ కాంగ్రెస్,ఎన్సీపి కూటమి బలం పెంచుకుంది. ప్రధానంగా ఎన్సీపిని చీల్చాలని చూసినా శరద్ పవార్నిలదొక్కుకుని తన సత్తా చాటారు. అలాగే ఈ ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ కు ఒక మంచి పరిణామం అని చెప్పాలి. లోకసభ ఎన్నికలలో మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షమైన ఎన్సీపీ పార్టీ ఘోరంగా విఫలమయ్యాయి కానీ ఈ అసెంబ్లీ ఎన్నికలలో ఈ రెండు పార్టీలు కూడా అంచనాలకు మించి రాణించారనే చెప్పాలి. హర్యాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యం కలిగించడం సహజం. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికాం ంలో ఉండటం, మోదీ గతం కంటే రెండోమారు బలంగా గెలిచి, జోరుమీద ఉ ండటం, విపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ఎన్నికలముందే అస్త్రసన్యాసం చేయడంతో ఈ రెండు చోట్లా బీజేపీదే హవా అని అంతా అనుకున్నారు. ఎగ్జిట్పోల్స్ కూడా అందుకు తగ్గట్లుగానే వచ్చాయి. కానీ ఫలితాలు మాత్రం భిన్నంగా కనిపించాయి. అధికార బిజెపి పార్టీ ప్రచారం మహోధృతంగా సాగినా, ఎన్నికల సభల్లో కాంగ్రెస్కు మోదీ సవాళ్ళు విసిరినా ప్రజల్లో మాత్రం బిజెపి పట్ల తీవ్ర అసంతృప్తి ఉందన్నది ఫలితాలను బట్టి వెల్లడయ్యిం దని చెప్పాలి. బిజెపి ఇప్పుడు ఫలితాలతో సంబంధం లేకుండా దేశ ఆర్థిక స్థితిగతులపై సమీక్షించుకోవాల్సి ఉంది. ప్రచారం మొత్తంగా దేశభక్తి, జాతీయవాదం, కశ్మీర్ చుట్టూ నడిచినా ప్రజలు మాత్రం ఇవి కాదన్న భావనలో ఉ న్నారు. తినడానికి తిండి లేని వాడికి, ఆర్థికంగా కొట్టుకు పోతున్న వాడికి కాశ్మీర్ కథలు చెబితే పనిచేయవని ఎన్నికల ఫలితలను బట్టి తెలుసుకోవాలి. రెండు రాష్ట్రాల్లోనూ రెం డోమారు మరింత భారీ మెజారిటీతో తమకు అధికారం కట్టబెడ తారన్న బీజేపీ నమ్మకాన్ని ఓటర్లు తిరస్కరించిన తీరుపై బిజెపి మేధోమథనం చేసుకోవాలి.ఒంటెత్తు పోకడలు కాకుండా దేశహితం కోరే పనలుఉ చేయాలి. ప్రజలు తమకు తాముగా బతకగలిగే ఆర్థిక విధానా లను అమలు చేయాలి. మరోవైపు మహారాష్ట్రలో మెజారిటీ తగ్గించి, మిత్రపక్షం శివసేనకు ఊహించనంత బలన్నిచ్చారు. ఇప్పుడు రెండుచోట్లా బీజేపీ మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమే అయినా అంత సులువుగా కాదన్న విషయం కూడా గమనించాలి. ఓటర్లను అంత తేలిగ్గా తీసుకోకూడదన్న విషయాన్ఇన బిజెపి పెద్దలు గుర్తించి అతర్మథనం చేయాలి. దేశంలో క్షీణిస్తున్న పరిస్థితులను చర్చించాలి. ఎంతసేపూ 370 ఆర్టికల్ పేరు చెప్పి ఎంతోకాలం ముందుకు సాగలేరు. సెంటిమెంట్ రాజకీయాలు కాకుండా ప్రజలు మనసారా దీవించేలా ఫలితాలు రాబట్టుకునే ప్రయత్నాలు చేయాలి. హారాష్ట్రలో బీజేపీ–శివసేన కూటమి 220పైనే స్థానాలు సంపాదిం చాలన్నది ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లక్ష్యం. ఇప్పుడు శివసేన చలువతో ఈ కూటమి 160 దాటగలిగింది. గత అసెంబ్లీ ఎన్నికలకంటే ముఖ్యమంత్రి మెజారిటీ తగ్గడం, ఏడుగురు మంత్రులు గెలవలేకపోవడం విశేషం. శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేదే ఇప్పుడు మహారాష్ట్రలో పైచేయిగా ఉంది. శివసేనను బెదరించి ప్రభుత్వం ఏర్పాటు చవేయగలిగే స్థితిలో బిజెపి లేదు. కూటమి విజయం గురించి పెద్దగా అనుమానాలు లేకపోయినా, శివసేన ఇంతగా బలపడుతుందని ఎవరూ అను కోలేదు. సుదీర్ఘకాలం శివసేనకు వెన్నంటి ఉ ంటూ వచ్చిన బీజేపీ 2014మోదీ ప్రభంజనంలో అధికవాటా కోసం డిమాండ్ చేయడం జరిగింది. ఇప్పుడు శివసేన పోటీచేసిన స్థానాలు తక్కువే అయినప్పటికీ, గతంలో బీజేపీ మాదిరిగానే వాటిలో ఎక్కువ సీట్లు నెగ్గడం గమనార్హం.. శివాజీనీ, సావార్కర్ను ముందుకు తెచ్చి శివసేనను ప్రాంతీయంగా మరింత కుదించేం దుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. ఆదిత్యఠాక్రే ప్రవేశంతో దాని దశ తిరిగింది. ఈ ఎన్నికల్లో శరద్పవార్ మరోమారు సత్తా చాటి, రాజకీయంగా ఆయన పనికూడా అయిపోయిందను కుంటున్న తరుణంలో బలంగా ముందుకొచ్చారు. మరింత దెబ్బ తింటుందనుకున్న కాంగ్రెస్ కొన్ని స్థానాలు పెంచుకోవడంతో, మహారాష్ట్రలో ఇప్పుడు విపక్షం బలంగా తయారైంది. ఎన్సిపి, కాంగ్రెస్లు సీట్లు పెంచ కోవడమే గాక, శివసేనకు అధికార పీఠాన్ని ఆశచూపేలా పావులు కదుపుతున్నారు. హర్యానాలో ఖట్టర్ తలబిరుసు కారణంగా అక్కడా ప్రజలు తమ తడాఖా చూపారు. జాటేతర కుల లన్నీ ఆయనవెంట నడుస్తు న్నాయనీ, 90 సీట్లలో 70 ఆయనవేనన్నారు. కానీ, దుశ్యంత్ చౌటాలా దెబ్బకు పరిస్థితి తారుమారైంది. భూపీందర్ సింగ్ హూడా చాణక్యంతో, జాట్ల ఆశీస్సులతో పదిసీట్లు కూడా రావనుకున్న కాంగ్రెస్ మూడురెట్లు ఎక్కువ సంపాదించింది.

ఎదురుతిరిగిన పుణె బ్యాంక్ కుంభకోణం

బెడిసి కొట్టిన శరద్ పవార్ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం

ముంబై,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో అంతా అయిపోయిందనుకున్న ఎన్సీపీ,కాంగ్రెస్ కూటమి బలం చాటటడం తాజా ఎన్నికల ఫలితాల్లో గమనించవచ్చు. ఇది ఓ రకంగా ఈ రెండు పార్టీల కూటమిలో ఉత్తేజాన్నినింపిందనే చెప్పాలి. ఎన్నికలకు ముందు ఎన్సీపిని టార్గెట్ చేసినా మరఠా యోధుడు శరద్పవర్ వృద్ధాప్యంలో కూడా తన సత్తా చాటారు. ఎన్సీపీ అధినేత శరద్పవార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేసిన ప్రచారం ఆ పార్టీతోపాటు భాగస్వామి కాంగ్రెస్కూ కలిసొచ్చింది. అసంతృప్తులు అధికార కూటమికి చేటు చేయగా.. పూణెళి సహకార బ్యాంకు కుంభకోణంలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పేరును చేర్చడం ద్వారా మరాఠా ఓటును కొల్లగొట్టాలనుకున్న కమలనాథుల ఆశలు నెరవేరకపోగా పశ్చిమ మహారాష్ట్రలో పవార్ వర్గీయులు మరింత బలపడేందుకు అవకాశం ఏర్పడింది. పవార్ ఈ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి పట్టును చాటుకున్నారు. 220 స్థానాలు సాధించి దేవేంద్ర ఫడ్నవిస్ను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తామని ధీమాగా ప్రకటించిన బీజేపీ బొటాబొటీ సీట్లతో మరోసారి పగ్గాలు చేపట్టడం బిజెపి స్వయంకృతంగానే చూడాలి.ఉనికిలోనే ఉ ండదనుకున్న కాంగ్రెస్, ఎన్సీపీ అటు ఇటుగా వంద సీట్లు సాధించి తమ ఉనికిని బలంగా చాటుకున్నాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేనలు విడివిడిగా పోటీ చేసి మొత్తం 288 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 122, శివసేన 62 స్థానాలు గెలుచుకోగలిగాయి. ఈసారి కలిసికట్టుగా బరిలోకి దిగినా గతంలో కంటే తక్కువ సీట్లు సాధించగలిగాయి. 147 స్థానాల్లో బరిలోకి దిగిన కాంగ్రెస్ దాదాపు 45 స్థానాలు గెలుచుకుంది. గత ఎన్నికల్లో ఈ పార్టీకి 42 సీట్లే దక్కాయి. రాహుల్, సోనియా, ప్రియాంక వంటి అగ్రనేతలెవరూ ప్రచారంలో పెద్దగా పాల్గొనక పోవడం, నాయకత్వ లేమి విజయావకాశాలను దెబ్బతీశాయని అంటున్నారు. కాంగ్రెస్ తన శక్తియుక్తులను వెచ్చింది ఉంటే బీజేపీ మరిన్ని స్థానాలు కోల్పోవాల్సి వచ్చేదని స్థానిక నేతలు వ్యాఖ్యానించారు. అయితే చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా మహారాష్ట్రలో మరోసారి బీజేపీ–శివసేనల మహాకూటమి అధికారాన్ని చేపట్టనుంది. అత్యధిక సీట్లలో గెలుపొంది ప్రభంజనం సృష్టించాలనుకున్న ఈ రెండు పార్టీల ఆశలు గల్లంతయ్యాయి. గతంతో పోలిస్తే సీట్ల సంఖ్య తగ్గినప్పటికీ మరో ఐదేండ్ల పాటు ఈ కూటమి రాష్ట్రాన్ని పాలించనుంది. అధికార కూటమికి గట్టి పోటీనిచ్చిన ప్రతిపక్ష కాంగ్రెస్–ఎన్సీపీ తమ సీట్ల సంఖ్యను పెంచుకున్నాయి. కాగా బీజేపీ, శివసేన 161 స్థానాలను గెలుచుకున్నాయి. ఈ రెండు పార్టీలు 200 నుంచి 230 వరకు సీట్లను గెలుచుకోగలవన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారయ్యాయి. ఎన్నికలకు ముందు కుదిరిన ఒప్పందం మేరకు బీజేపీ–శివసేన చెరో రెండున్నరేండ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని చేపట్టే అవకాశాలున్నాయి. గతంతో పోలిస్తే కాంగ్రెస్ కేవలం రెండు సీట్లను అధికంగా గెలుచుకోగా, ఎన్సీపీ బాగా పుంజుకుంది. గత అసెంబ్లీలో 41 సీట్లున్న ఎన్సీపీ ఈసారి 54 సీట్లకు ఎగబాకింది. 2014లో ఒంటరిగా పోటీ చేసి 63 స్థానాలు గెలుచుకున్న శివసేన ఈసారి బీజేపీతో పొత్తు ఉన్నప్పటికీ ఏడు సీట్లను కోల్పోవడం గమనార్హం. అయితే ఈ ఎన్నికల్లో తన కుమారుడు ఆదిత్య ఠాక్రేను గెలిపించుకున్న శివసేన అధినేత ఉద్ధవ్ఠాక్రే.. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తనతో చేసిన వాగ్దానాన్ని అమలు చేయాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. అధికారానికి వస్తే చెరో రెండున్నరేండ్లు సీఎం పదవిని చేపట్టాలని తమ మధ్య అంగీకారం కుదిరినట్టు ఉద్ధవ్ వెల్లడించారు. అధికారాన్ని పంచుకునే విషయంలో ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారమే నడుచుకుంటామని సీఎం ఫడ్నవీస్ చెప్పారు. మొత్తంగా మహారాష్ట్రలో స్థానిక అంశాలు బాగా ప్రభావితం చేశాయి.

ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడింది

ఆర్టీసీ కార్మికుల సమ్మెలో మందకృష్ణ ఆవేదన

మంచిర్యాల,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఆర్టీసీనే కాదు.. ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మందకృష్ణ...ముఖ్యమంత్రి కేసీఆర్పై నిప్పులు చెరిగారు. ఆర్టీసీ ఆస్తులను కాజేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుంతు ందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించు కోవడం కోసం రాబోయే రోజుల్లో పరిరక్షణ పోరాటం చేస్తామని ప్రకటించారు. ఆర్టీసీని ఖతం చేస్తే ప్రజలు ఊరుకోరు అని హెచ్చరించారు. నిజాంను తరిమికొట్టిన తెలంగాణ గడ్డ ఇదని.. కేసీఆర్కు అదే గతి పడుతుందని పేర్కొన్నారు. ప్రజల హక్కులను హరించే వారిని ఈ గడ్డమీదే భూస్థాపితం చేయాలని కాళోజీ అన్నాడు. ఇప్పుడు ప్రజలు అదే చేయబోతున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు డిపోల ముందే ఆందోళనలు చేశారు. కానీ ఇప్పుడు కనీసం డిపోల దగ్గరికి కూడా వెళ్లనివ్వట్లేదు అని మందకృష్ణ మండిపడ్డారు. కార్మికులు న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తుంటే పోలీసులు వారిపై అక్రమ కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడటం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. జిల్లాలో కార్మికులపై పోలీసుల వేధింపులకు నిరసనగా త్వరలోనే అఖిలపక్షం ఆధ్వంలో 'చలో మంచిర్యాల'ను నిర్వహిస్తామని వెల్లడించారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ గెలుపుపై మందకృష్ణ స్పందిస్తూ.. టీఆర్ఎస్ వందల కోట్లు ఖర్చు చేసి గెలిచిందని ఆరోపించారు. ఉప ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన సాధారణ ఎన్నికలోనూ గెలుస్తామనుకోవటం పొరపాటు అని వ్యాఖ్యానించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని మందకృష్ణ విమర్శించారు. ఆర్టీసీపై ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యమని మందకృష్ణ మాదిగ విమర్శించారు. తెలంగాణలో రాజ్యాంగం, కోర్టులు లేనట్టుగా కేసీఆర్ భావిస్తున్నారని, కేవలం ఆర్టీసీనే కాదు తెలంగాణ రాష్ట్రమే ప్రమాదంలో పడిందన్నారు. ఆర్టీసీని ఖతం చేస్తే ప్రజలు ఊరుకోరని అన్నారు. హుజూర్నగర్లో వందల కోట్లు ఖర్చు చేసి టీఆర్ఎస్ గెలిచిందని మందకృష్ణ ఆరోపించారు. ఆ అహంకారంతోనే కేసీఆర్ మాట్లాడుతున్నారని, ఉప ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన...జనరల్ ఎన్నికల్లో గెలుస్తామనుకోవడం పొరపాటన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం భవిష్యత్లో పోరాటం చేస్తామని మందకృష్ణ స్పష్

అహంకారాన్ని ప్రజలు ఇష్టపడరు: శరద్ పవార్

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): అధికారపూర్వక అహంకారాన్ని ప్రజలు ఇష్టపడరని మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరూపించాయని నేషనల్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ అన్నారు. తాజాగా వెల్లడైన ఫలితాల్లో అధికార బీజేపీ దాని భాగస్వామి శివసేన తక్కువ మెజార్టీతో అధికారాన్ని చేజిక్కించుకుందన్నారు. ఎన్నికల పోలింగ్ ముందు బీజేపీ, శివసేన పార్టీలోకి ఫిరాయించిన నేతలను సైతం ప్రజలు అంగీకరించలేదన్నారు. బీజేపీకి అధికారం దూరం చేసేందుకు కాంగ్రెస్, ఎన్సీపీ కూటమి శివసేనకు మద్దతు తెలపాలనుకుంటున్న వార్తలపై మీడియా ప్రశ్నించగా అటువంటి సమాచారమేది లేదని పవార్ అన్నారు. అంటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఆ ప్రతిపాదనకు తాను సమ్మతం కాదన్నారు. సరికొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు తామంతా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమని ప్రతిపక్షంలో కూర్చోమని చెప్పారు. ప్రజాతీర్పును అంగీకరిస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం సమర్థవంతంగా లేనప్పటికీ శరద్ పవార్ ఒక్కరే ఒంటిచేత్తో ప్రతిపక్ష ప్రచారాన్ని నడిపించారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిశాయన్న పవార్ ఎమ్మెలేల్యలంతా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడిలో ఎన్సీపీ పార్టీ 57 స్థానాల్లో ముందంజలో ఉంది.

హుజూర్ నగర్‌లో రికార్డులు బ్రేక్

- 43,233ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన సైదిరెడ్డి

సూర్యాపేట, అక్టోబర్25(ఆర్ఎన్ఎ) : హుజూర్ నగర్ ఉప ఎన్నికల్లో టిఆర్ ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి ఘన విజయం సాధించారు. ఆయన తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిపై 43,233 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.. కౌంటింగ్ ప్రారంభమైన ప్పటి నుంచి సైదిరెడ్డి భారీ అధిక్యంతో దూసుకపోయారు.. మొత్తం 22 రౌండ్ల లోనూ సైదిరెడ్డి మంచి మెజార్టీ సాధించారు. ఈ స్థానం నుంచి పోటీ చేసిన టిడిపి అభ్యర్థి కిరణ్మయి, బిజెపి అభ్యర్థి రామారావులతో పాటు ఇక్కడ పోటీ చేసిన మరో 23 మంది స్వతంత్రులు డిపాజిట్స్ పొగొట్టుకున్నారు.. ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సుమన్ కు మూడో స్థానం రాగా, నాలుగో స్థానంలో బిజెపి, అయిదో స్థానంలో టిడిపి నిలిచాయి.

గత రికార్డులన్నీ బ్రేక్!

హుజూర్‌నగర్‌లో సైదిరెడ్డి భారీ మెజార్టీ గత రికార్డులన్నీ బ్రేక్ చేశారు. ఇప్పటి వరకూ ఈ నియోజకవర్గంలో ఉన్న రికార్డ్‌ను ఈ ఉప ఎన్నికతో బ్రేక్ చేసేశారు. ఈయన సాధించిన మెజార్టీ ఇంతవరకూ హుజూర్‌నగర్ చరిత్రలోనే సాధించలేదు. ఇప్పటి వరకూ హుజూర్‌నగర్‌లో 29,194 ఓట్లు మెజార్టీతో 2009లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ కుమార్ గెలుపొందారు.. ఇదే ఇప్పటి వరకూ ఉన్న అత్యధిక మెజార్టీ. అయితే సైదిరెడ్డి దానిని బ్రేక్ చేసి ఏకంగా 43,233 ఓట్ల మెజార్టీ సాధించడం విశేషం. 2009 అసెంబ్లీలో ఎన్నికల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డి 29, 194 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డికి 80, 835 ఓట్లు రాగా, ప్రత్యర్థి టీఆర్ఎస్ అభ్యర్థి జగదీష్ రెడ్డికి 51, 641 ఓట్లు పోలయ్యాయి. అదేవిధంగా 2014 అసెంబ్లీలో ఎన్నికల్లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి 23,924 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డికి 69,879 ఓట్లు రాగా, ప్రత్యర్థి టీఆర్ఎస్ అభ్యర్థి శంకరమ్మకు 45,955 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా 2018 ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఉత్తమ్ కుమార్ రెడ్డి 7,466 ఓట్ల మెజార్టీతో సాధించారు. ఈ ఎన్నికల్లో ఉత్తమ్‌కు 92,996 ఓట్లు రాగా, ప్రత్యర్థి టీఆర్ఎస్ అభ్యర్థి సైదారెడ్డికి 85,530 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం జరిగిన ఉప ఎన్నికల్లో ఆ రికార్డులన్నీ బద్దలు కొడుతూ.. టీఆర్ఎస్ అభ్యర్థి సైదారెడ్డి 43, 233 ఓట్ల మెజార్టీ సాధించారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

- దేశంలో ఎక్కడాలేని విధంగా స్థానికులకే 75శాతం ఉద్యోగాలు
- రాష్ట్రంలో మరో సీపెట్ కేంద్రంకై కేంద్రమంత్రిని కోరాం
- త్వరలో 25పార్లమెంట్ నియోజకవర్గాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు
- సీపెట్ ప్రారంభ కార్యక్రమంలో ఏపీ సీఎం జగన్
- కొత్త రాష్ట్రాల అభివృద్ధి చెందాలన్నదే మోదీ ఆకాంక్ష
- కొత్త రాష్ట్రాల అభివృద్ధితో దేశం వృద్ధి చెందుతుంది
- నెల్లూరు జిల్లా నాయుడుపేటలో మరో సీపెట్ సంస్థ ఏర్పాటు చేస్తాం
- కేంద్ర మంత్రి సదానందగౌడ హామీ

విజయవాడ, అక్టోబర్25(ఆర్ఎన్ఎ) : ఏపీలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, దీనిలో భాగంగా యువతను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలో 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలో నూతనంగా నిర్మించిన సీపెట్ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎ÷-లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ) భవనాలను కేంద్ర మంత్రి సదానంద గౌడతో కలిసి సీఎం ప్రారంభిం చారు. సీపెట్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఏపీ యువత అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ ఇవ్వటం జరుగుతుందని అన్నారు. నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలను తీసుకుంటున్నామని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో స్థానికులకే 75శాతం ఉద్యోగ అవకాశాలు ఇచ్చేలా చట్టం చేశామని అన్నారు. మన పిల్లలకు ఉద్యోగా లు ఇవ్వాలనే దీన్ని తీసుకొచ్చామన్నారు. మన పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇంకా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేస్తున్నామని జగన్ తెలిపారు. ప్లాస్టిక్ ఇంజినీరింగ్‌లో శిక్షణ పొందినవారికి మంచి అవకాశాలున్నాయని, ఇలాంటి సంస్థలను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 25 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామని జగన్ తెలిపారు. కేంద్ర సాయం ద్వారా మరిన్ని అవకాశాలు కల్పిస్తామనా న్నారు. రాష్ట్రంలో మరో సీపెట్ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రిని కోరామని, త్వరలో నిర్ణయం తీసుకుం టామని ఆయన చెప్పారని సీఎం జగన్ తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి సదానంద గౌడ మాట్లాడుతూ.. ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సీపెట్‌ది కీలక పాత్ర అన్నారు. ప్రపంచంలో అధిక సంఖ్యలో యువత ఉన్న దేశం మనదేనని, దేశాభివృద్ధిలో యువతే కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సీపెట్ కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నా యని, విజయవాడ కేంద్రం 2015లో ప్రారంభమై ఇప్పుడు కార్యకలాపాలు ప్రారంభించిందని, నిరుద్యోగ యువతకు ఇదోమంచి అవకాశ అన్నారు. ఈనెల చివరిలో కొచ్చిలో మరొకటి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ మన జీవితం లోనే భాగమైందని, దాన్ని రీసైక్లింగ్ చేయ డం ద్వారా కలుషితం కాకుండా చూడా లన్నారు. ఇటీవల ప్రధాని ప్లాస్టిక్ నిర్మూల నకు పిలుపునిచ్చారని మంత్రి తెలిపారు. అత్యాధునిక సాంకేతికత ద్వారా ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసేందుకు సీపెట్ కృషిచేస్తోం దన్నారు. విజయవాడలో పరిశ్రమలకు మంచి అవకాశం ఉందని, ఇక్కడ ఎలాంటి పరిశ్రమలకు అవసరం ఉందో సీఎంతో చర్చిస్తానని, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల అభివృద్ధి చెందాలన్నదే మోదీ ఆకాంక్ష అని సదానందగౌడ తెలిపారు. కొత్త రాష్ట్రాల అభివృద్ధితో దేశం వృద్ధి చెందుతుందని, నెల్లూరు జిల్లా నాయుడుపేటలో మరో సీపెట్ సంస్థ ఏర్పాటు చేస్తామని సదానందగౌడ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలో నిర్మించిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీని (సీపెట్)ను గురువారం ప్రారంభించిన అనంతరం మొక్కల నాటిన కేంద్ర మంత్రి సదానంద గౌడ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

కేసీఆర్ పాలనకు ప్రజల దీవెన

హుజూర్‌నగర్ ఫలితంపై తలసాని ఆనందం

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ ఉపఎన్నికలో టీఆర్ఎస్ వి.యంతో టీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ భవన్ సంబరాల్లో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పరిపాలనను మెచ్చి హుజూర్ నగర్ ప్రజలు టీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తున్నారని అన్నారు. కేసీఆర్ చేపట్టిన పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఏ ఎన్నికలైనా టీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. దేశానికి మోడల్ కేసీఆర్ ప్రభుత్వమని తెలిపారు. హుజూర్‌నగర్ తీర్పు టీఆర్ఎస్ పాలనకు ప్రజలు వేసిన మార్కులకు నిదర్శనమని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. టిఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. కేసీఆర్ నాయకత్వానికి దీనిని ప్రజలిస్తున్న తీర్పుగా అభివర్ణించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శమన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై యాగీ చేయాలనుకుంటున్నవారు ఇప్పటికైనా కళ్లు తెరవాలని తలసాని సూచించారు. గెలిస్తే పొంగిపోమని.. ఓటమికి కుంగిపోమని వ్యాఖ్యానించారు. గెలుపోటములను సమానంగా తీసుకొని ముందుకెళ్తామని తలసాని స్పష్టం చేశారు. రానున్న ఏ ఎన్నికైనా తమదే గెలుపన్నారు.

నవంబర్‌లోనే మున్సిపల్ ఎన్నికలు పూర్తి: సీఎం కేసీఆర్

హైదరాబాద్,అక్టోబర్ 25: నవంబర్ నెలలోనే మున్సిపల్ ఎన్నికలు పూర్తి అవుతాయని సీఎం కేసీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. పల్లె ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చాలా అద్భుతంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతీవారు మెచ్చుకుంటున్నరు. మంచి సత్ఫలితాలు వచ్చినయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెండు నూతన చట్టాలు తెచ్చింది. గ్రామపంచాయతీ చట్టం, కొత్త మున్సిపల్ చట్టం తెచ్చాం. రెవెన్యూ చట్టం రావాల్సి ఉంది. గ్రామ పంచాయతీ చట్టం, మున్సిపల్ చట్టం ద్వారా నియంత్రిత విధానంలో గ్రామాలు, పట్టణాల అభివృద్ధి జరగాలి. ఉత్త మాటలు చెప్పి అభివృద్ధి అంటే కుదరదు. అందుకు నిధులు సమకూర్చాలి. సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే గ్రాంట్స్‌తో పాటు అంతే స్థాయిలో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా ఇచ్చి అభివృద్ధి చేయాలనుకున్నం. గ్రామపంచాయతీలకు ప్రతీనెల రూ.339 కోట్లను విడుదల చేస్తున్నాం. మున్సిపాలిటీలకు కూడా ఇప్పుడు రూ. 1030 కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులు ఉన్నవి. ఇంతే మొత్తంలో తాము కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించాం. మొత్తం కలిపి రూ. 2060 కోట్లను రాష్ట్రంలోని 141 మున్సిపాలిటీల అభివృద్ధికి కేటాయించనున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఎన్నికలకు హైకోర్టు బెంచ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది, మరో సింగిల్ బెంచ్ న్యాయమూర్తి వద్ద మరికొన్ని కేసులు ఉన్నవి. రేపు వాటిపై తీర్పు వస్తుంది. తీర్పు అనంతరం ఈసీ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదన వస్తది. వచ్చిన వెంటనే నోటిఫికేషన్ వెలువరిస్తం. నవంబర్ మాసంలోనే మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం పట్టణ ప్రగతి ప్రణాళిక కూడా ఒక నెల పాటు చేపడతామని సీఎం తెలిపారు.

ప్రక్షాళన దిశగా పౌరసరఫరా శాఖ

రిటైర్డ్ ఐఎస్ అధికారి సత్యనారాయణరెడ్డికి పగ్గాలు

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): పౌరసరఫరాల శాఖను ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పావులు కదుపుతోంది. బియ్యం సరఫరాలో అక్రమాలను నిరోధించడానికి పూనుకుంది. ఇందులో భాగంగా తెలంగాణ పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా రిటైర్డ్ ఐఎస్ అధికారి సత్యనారాయణరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కమిషనర్‌గా కొనసాగుతున్న ఐపీఎస్ అధికారి అకున్‌సబర్వాల్ కేంద్ర సర్వీసులకు వెళ్లడంతో ప్రభుత్వం సత్యనారాయణరెడ్డిని నియమించింది. పదవీ విరమణ చేసిన సత్యనారాయణరెడ్డిని రెండు సంవత్సరాలకు గాను కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వం నియమించింది. తెలంగాణలో ప్రస్తుతం పౌరసరఫరాలశాఖ ఉనికి పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రేషన్‌షాపుల ద్వారా ఏ నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండడం లేదు. కేవలం రూపాయికే కిలో బియ్యం పథకం మాత్రమే కొనసాగుతోంది. కిరోసిన్‌ను రేపో మాపో పూర్తిగా ఎత్తివేయనున్నారు. గోధుమలు కూడా నెల నెలా అందుబాటులో ఉండడం లేదన్నఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న సత్యనారాయణరెడ్డి ప్రస్తుతం ఈశాఖలో నెలకొన్న అనేక అంశాలపై ఏ విధంగా స్పందిస్తారోనన్న విషయంపై ఇటు అధికారుల్లో చర్చమొదలైంది.

ఏడాదిలోపు జర్నలిస్టులందరికీ ఇండ్లు: సీఎం కేసీఆర్

హైదరాబాద్,్,అక్టోబర్ 25:: జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత తనదని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ లో సీఎం కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు సరిగా రాలేదన్నారు. పెద్ద పెద్ద స్థాయిల్లో ఉన్నవారికి కూడా స్థలాలు రాలేదని సీఎం కేసీఆర్ తెలిపారు.

వందకు వంద శాతం హైదరాబాద్‌లో ప్రతీ జర్నలిస్టుకు ఇళ్లు వచ్చే బాధ్యత తనదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఏ ప్రభుత్వం కేటాయించని నిధులు టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చింది.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న డబ్బు..జర్నలిస్టు కుటుంబాలకు అండగా నిలుస్తోంది. న్యాయవాదుం సంక్షేమం కోసం ఇచ్చిన డబ్బు కన్నా..

జర్నలిస్టులకు కేటాయించిన డబ్బు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్యం బాగా లేకపోయినా, ప్రమాదవశాత్తు చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు ఈ నిధులు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ఏడాదిలోపు జర్నలిస్టులందరికీ ఇండ్లు కేటాయించి ఇవ్వడమే కాకుండా..మంచి హౌసింగ్ స్కీం ప్రవేశపెట్టి ఇండ్లు కూడా కట్టుకునేట్లు ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. వచ్చే బడ్జెట్‌లో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలనుకుంటున్నట్లు చెప్పారు.

ఆంధ్ర రాష్ట్రంలో ఇక ఆధార్ సేవలు మరింత సులభం

మొదటి ఆధార్ సేవా కేంద్రం లబ్బీపేట, విజయవాడ లో ప్రారంభం

విజయవాడ, అక్టోబరు 25:ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ద్వారా నిర్వహించబడుచున్న మొట్టమొదటి ఆధార్ సేవా కేంద్రం లబ్బీపేట, విజయవాడ లో పని చేయుట ప్రారంభించినది (చిరునామా: 39-10-7, మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఎదురుగా, లబ్బీపేట, విజయవాడ-520 002). ఈ కేంద్రం లో ప్రతి రోజూ 500 వరకు ఆధార్ నమోదు/ అప్‌డేట్స్ (నవీకరణలు) చేసే సామర్థ్యం ఉన్నది. ఇక్కడ నమోదు మరియు పేరు, చిరునామా, పుట్టిన తేదీ, జెండర్, మొబైల్ నెంబర్, ఇ-మెయిల్ మొదలగు అప్ డేట్స్ (నవీకరణలు) చేసుకోవచ్చు. అంతేకాకుండా, బయోమెట్రిక్స్ సంబంధిత ఫోటో, వేలి ముద్రలు మరియు కనుపాల అప్‌డేట్స్ (నవీకరణలు) కూడా చేసుకోవచ్చు.

యుఐడిఎఐ సంస్థ తమ వెబ్ సైట్ జీబఎ.బీతిటజీతి.ణనీల.తిని ద్వారా ప్రజలు ఆన్ లైన్ లో అపాయింట్‌మెంట్ తీసుకొనే సౌకర్యం కూడా కల్పించింది. ఈ కేంద్రం ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పని చేస్తుంది. మరియు వారంలో 7 రోజులూ తెరచి ఉంచబడుతుంది. తగినంత సీటింగ్ వసతితో పాటు, ఈ కేంద్రం ఎయిర్ కండిషన్ చేయబడిన భవనంలో నిర్వహించబడుతుంది. తప్పక గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, 5 మరియు 15 సంవత్సరాలు నిండిన పిల్లలకు విధిగా వర్తించే బయోమెట్రిక్స్ నవీకరణ పూర్తిగా ఉచితం. ఇతర అప్‌డేట్స్ (నవీకరణలు) కొరకు ఈ కేంద్రం 50 రూపాయలు రుసుము వసూలు చేస్తుంది.

ఈ కేంద్రంలో విజయవాడ లో నివసించే వారితో పాటు ఏ ప్రాంతం వారైనా కూడా ఆధార్ సేవలు ఉపయోగించుకోవచ్చు.

సోయాబీన్ కొనుగోలు 50శాతానికి పెంచాలి

-కేంద్రానికి విన్నవించిన నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): సోయాబీన్ కొనుగోలు 50 శాతానికి పెంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న 30.21 శాతం సరిపోదన్నారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి నరేంద్రసింగ్ తోమర్‌కు లేఖ రాశారు. మార్కెట్ ధరలు కన్నా కనీస మద్దతు ధర ఎక్కువగా ఉందని.. దీంతో రైతులు కూడా ఉత్సాహం చూపిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం లక్ష్యంగా ఉన్న సోయా కొనుగోలు పరిమాణం 58,608 మెట్రిక్ టన్నుల(అంచనా ఉత్పత్తిలో 30.21శాతం) నుంచి 96,991 మెట్రిక్ టన్నులకు (50 శాతం) పెంచాలని నిరంజన్‌రెడ్డి కోరారు.

అదుపుతప్పిన బస్సు: తప్పిన ముప్పు

నిజామాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లా మల్లారం గండి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆర్టీసీ బస్సుకు గురువారం తృటిలో ప్రమాదం తప్పింది. నిజామాబాద్ నుంచి బాన్సువాడ వెళ్తుండగా మార్గ మధ్యలో బస్సు అదుపు తప్పడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కకు దిగిపోయింది. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రయాణీకులు వెంటనే కిటికీల నుంచి కిందకు దిగారు. కాగా అడవిలోకి దూసుకుపోయి ఉంటే మరింత ప్రమాదం తలెత్తే అవకాశం ఉండేదని డ్రైవర్‌పై తోటి ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫలితాల తీరుతో రాజీనామా చేసిన బిజెపి అధ్యక్షుడు

రాజీనామా వార్తలను ఖండించిన బరాలా

చండీఘడ్,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): హర్యానా బిజెపి అధ్యక్షుడు సుభాష్ బరాలా తన పదవికి రాజీనామా చేశారు. హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న క్రమంలో బిజెపి ఓటమికి బాధ్యత వహిస్తూ బరాలా రాజీనామా చేశారు. తోహానా అసెంబ్లీ స్థానంలో బరాలా వెనుకంజలో ఉన్నారు. హర్యానాలో హంగ్ అసెంబ్లీ ఏర్పడే దిశగా ఫలితాలు వస్తున్నాయి. బిజెపి 41, కాంగ్రెస్ 31, జెజెపి 10, ఇతరులు 8 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు. అయితే జెజెపి, కాంగ్రెస్ జత కట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో జెజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తాము పూర్తి మద్దతు ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇకపోతే బీజేపీ నేత, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గెలుపు దిశగా దూసుకుపోతున్నారు. మనోహర్‌లాల్ ఖట్టర్ హర్యానాలోని కర్నల్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. కాంగ్రెస్ నేత టర్లోచన్ సింగ్‌పై 41,950 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే ఈ ఎన్నికల్లో ప్రజలు మిశ్రమ ఫలితాలను అందించారు. ప్రస్తుత మెజార్టీ స్థానాలు చూస్తే బీజేపీ, కాంగ్రెస్ ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఢిల్లీకి రావాలంటూ పార్టీ అధిష్టానం ఆదేశించింది. మరోవైపు హర్యానాలో బీజేపీని జాట్ వ్యతిరేకత గట్టిగా దెబ్బతీసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ కోలుకోవడానికి జాట్ల మద్దతే కారణమనే విశ్లేషణలు వస్తున్నాయి. అయితే గ్రామీణ నియోజకవర్గాల్లో ఐఎన్ఎల్డీ ఓటు జేజేపీ వైపు మళ్లింది. హర్యానాలో ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా బీజేపీని అడ్డుకునేందుకు భూపీందర్‌సింగ్ హుడా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దుష్యంత్ చౌతాలాతో భూపీందర్ నేరుగా చర్చలకు సిద్ధపడుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

రాజీనామా వార్తలు అబద్ధమన్న బరాలా

అయితే తాను రాజీనామా చేయలేదు.. అవి కేవలం పుకార్లే అని హర్యానా బీజేపీ చీఫ్ బరాలా ప్రకటించారు.

హర్యానా బీజేపీ చీఫ్ పదవికి తాను రాజీనామా చేసినట్లు వస్తున్న వార్తల్లో నిజంలేదని చెప్పారు సుభాష్ బరాలా. ఆ వార్తలను ఖండించిన ఆయన అవి పుకార్లు మాత్రమే అని కొట్టిపారేశారు. హర్యానాలో బీజేపీ అధికారంలోకి వస్తుంది అని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనావేశాయి. కానీ అంచనాలు తప్పాయి. హర్యానాలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోలేకపోతుందనేది ట్రెండ్స్‌ను చూస్తే అర్థమవుతోంది. ఈ క్రమంలోనే హర్యానా బీజేపీ చీఫ్ సుభాష్ బరాలా బీజేపీ పేలవ ప్రదర్శనకు బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నారనే వార్తలు జోరుగా ప్రచారం అయ్యాయి. ఈ వార్తలను ఆయన ఖండించారు. అవి కేవలం పుకార్లు అని కొట్టిపారేశారు. ఇక తోహానా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వయంగా పోటీచేసిన సుభాష్ బరాలా విజయావకాశాలు దాదాపు సన్నగిల్లిపోయాయి. ఫతేహాబాద్ జిల్లాలోని తోహానా నుంచి ఆయన బరిలో నిల్చున్నారు. కడపటి వార్తలు అందేసరికి తన సమీప ప్రత్యర్థి జన్‌నాయక్ జనతా పార్టీకి చెందిన దేవేందర్ సింగ్ బబ్లీ పై 20వేల ఓట్లతో వెనకంజలో ఉన్నారు.ఇదిలా ఉంటే హర్యానాలో హంగ్ అసెంబ్లీ తప్పదనే ట్రెండ్స్ చెబుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ రాష్ట్రంలో బీజేపీకి భంగపాటు తప్పలేదు. ఇక జేజేపీ పార్టీ 10 స్థానాల్లో లీడింగ్‌లో ఉంటూ సత్తా చాటుతోంది. అంతేకాదు కింగ్ మేకర్‌గా అవతరించే అవకాశాలున్నాయి. బీజేపీకి ఈ పరిస్థితి ఉత్పన్నం

అయ్యేందుకు కారణం హర్యానాలో తగ్గిన పోలింగ్ శాతమే అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2019 హర్యానా అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం భారీగా పడిపోయి 68.47శాతమే జరిగింది. ఇప్పుడు ఇదే బీజేపీ కొంపముంచింది. ఓట్ల లెక్కింపు ప్రారంభంకాగానే బీజేపీ కాంగ్రెస్‌ల మధ్య చాలా దగ్గరగా పోటీ నెలకొంది. ఇక ఈ ఏడాది మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే పోలింగ్ శాతం భారీగా ఉన్నింది. దీంతో ఫలితాలు కూడా ముందుగా ఊహించినట్లుగానే వచ్చాయి. స్పష్టమైన మెజార్టీతో ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చాయి.

పీసీసీ చీఫ్ పదవి రేసులో నేనున్నా

హుజూర్‌నగర్ ఫలితం వ్యతిరేకంగా రావడంతో వీహెచ్ సంచలనం

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ కంచుకోట బద్దలైంది. హుజూర్ నగర

ఆర్టీసీ కథ ముగిసిందన్న సిఎం కేసీఆర్

చేజేతులా కార్మిక నేతలే సంస్థను ముంచుకున్నారు
ఆర్టీసీని ఎవరూ కాపాడలేరని స్పష్టం చేసిన సిఎం
గొంతెమ్మ కోర్కెలతో అర్థంపరథం లేకుండా సమ్మె
కార్మిక సంఘాల తీరుతో రోడ్డున పడ్డ కార్మికులు
యూనియన్ ఎన్నికలకు ముందు చేస్తున్న హంగామా
విపక్షాల తీరునూ దుయ్యబట్టిన సిఎం కెసిఆర్
ఆయా రాష్ట్రాల్లో ఎందుకు విలీనం చేయలేదని ప్రశ్న
ఆర్టీసీని కాపాడలేమని స్పష్టీకరణ

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ అన్నది ఇక గడచిన చరిత్ర అని సెంకెసిఆర్ స్పష్టం చేశారు. అది మనుగడలో లేనే లేదన్నారు. ఆర్టీసీని కార్మిక సంఘాలే పాతరేసుకున్నాయని అన్నారు. తెలంగాణ భవన్లో కెఇసార్ మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ సంగాల తీరును, అందుకు పత్తాసు పలుకతున్న వపిక్షాల తీరును ఘాటుగా దుయ్యబట్టారు. పనికిమాలిన సమ్మె అంటూ ఎద్దేవా చేశారు. సంస్థను చేజేతులా చంపుకున్న దానికి బాధ్యులు కార్మిక సంఘాలేనని అన్నారు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెపై సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ వాళ్లకు బుద్ధి, జ్ఞానం ఉందా అని కేసీఆర్ తిట్టిపోశారు. తిన్నది అరగక చేస్తున్న సమ్మె ఇదని కేసీఆర్ మండిపడ్డారు. యూనియన్ ఎన్నికల ముందు చేస్తున్న పనికిమాలిన సమ్మె ఇదని ఆయన చెప్పారు. మూడునాలుగేళ్లకు ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ గొంతెమ్మ కోరికలు కోరే చిల్లరమల్లర రాజకీయాలు ఇవని కేసీఆర్ ఆగ్రహించారు. ఆర్టీసీ సమ్మె ముగియడం కాదని, ఇక ఆర్టీసీనే ముగుస్తుందని కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక ఆర్టీసీని ఎవరూ కాపాడలేరని, అయిపోయిందని.. ఆర్టీసీ దివాళా తీసిందని సీఎం వ్యాఖ్యానించారు. నెలకు ఆర్టీసీకి 100 కోట్లకు పైగా నష్టం వస్తోందని చెప్పారు.

ఆర్టీసీ బస్సులకు రోజుకు రూ.3 కోట్లు నష్టం వస్తోందని, ప్రైవేట్ బస్సులకు మాత్రం రూ.4 లక్షల లాభం వస్తోందని ఆయన తెలిపారు. ఆర్టీసీ కార్మికులు అద్దె బస్సులు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. దిక్కుమాలిన నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీసీని ముంచుతామని, నువ్వు కాపాడుకో అన్నట్లుగా కార్మికుల ధోరణి ఉందని కేసీఆర్ మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికులకు సుమారు రూ.50 వేల జీతం వస్తుందని, అవసరం అయినప్పుడు ఒక గంట ఎక్కువ పనిచేయలేరా అని నిలదీశారు. 'మా కాళ్లు మేమే నరుక్కుంటాం' అన్నట్లు వ్యవహరించవద్దని ఆర్టీసీ కార్మికులకు సీఎం కేసీఆర్ హితవు పలికారు. ఇకపోతే తెలంగాణలో సమ్మె బాట పట్టిన ఆర్టీసీ కార్మికులకు సీఎం కేసీఆర్ ఓ ఆఫర్ ఇచ్చారు. యూనియన్లు పక్కనపెట్టి ఆర్టీసీ కార్మికులు పనిచేస్తే రెండేళ్ల లో రూ.లక్ష బోనస్ తీసుకునే పరిస్థితి ఉంటుందని కేసీఆర్ చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె అక్రమమని, ఎస్మా ఉండగా సమ్మెకు పోవడం కరెక్ట్ కాదని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణలో 2600 బస్సులు రీప్లేస్‌మెంట్ చేయాల్సిన అవసరం ఉందని, వాటికి రూ. వెయ్యి కోట్లు అవసరమని కేసీఆర్ తెలిపారు. పాత ఆర్టీసీ బతికిబట్టగట్టే పరిస్థితి లేకుండా యూనియన్లు చేశాయని, యూనియన్ల చిల్లరరాజకీయాలతో ఆర్టీసీకి భవిష్యత్ ఉండదని సీఎం వివరించారు. 'ఆర్టీసీ సమ్మెకు ఆర్టీసీ ముగింపే జవాబు' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులు అర్థంపర్థంలేని డిమాండ్లు చేస్తున్నారని పిచ్చి పంథాను ఎంచుకున్నారని తెలిపారు. ఆర్టీసీని సరైన మార్గంలో నడిపించాలనే ఉద్దేశ్యంతో బ్జడెట్‌లో కేటాయింపులు చేస్తే కార్మికులు మాత్రం పిచ్చిగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆర్థిక మాంద్యం కొన్ని రంగాలు కుప్ప కూలాయని ఆ పరిస్థితి మన ఆర్టీసీకి రావద్దన్నారు. ఆర్టీసీ అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం అన్నారు. తాను గతంలో రవాణా శాఖ మంత్రిగా పనిచేశానని.. అందుకే దేశంలోనే తెలంగాణ ఆర్టీసీ కార్మికుల జీతాలు ఎక్కువగా పెంచామన్నారు. ఎవరుపడితే వారువచ్చి ప్రభుత్వంలో కలపాలంటే ఏంటి పరిస్థితి..మిగతా 57 కార్పొరేషన్లు అడిగితే ఎంటి పరిస్థితి అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో కలపడం అనేది అర్థంపర్థంలేని డిమాండ్ అన్నారు. ఎక్కడేం పనిలేక జెండాపట్టుకుని మాట్లాడుతున్నారని.. సీఎం అయ్యాక నాలుగేళ్లలో ఆర్టీసీ ఉద్యోగుల జీతాలను 67శాతం పెంచానని గుర్తు చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓ పద్ధతి బాధ్యత ఉందన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక ఉంటే..గొంతెమ్మ కోర్కెలా అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఆర్టీసీని ఎత్తేశారని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు.ఆర్టీసీ కార్మికుల సమ్మెపై సీఎం కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం తరపున కమిటీ వేసింది తానేనని, చర్చలకు పిలవలేదన్న వెధవ ఎవరని కేసీఆర్ మండి పడ్డారు. తెలం గాణ పోరాటంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొం టే మాత్రం ఏమిటని, ఆర్టీసీ కార్మికులు ఒక్కరే పాల్గొన్నారా అని సీఎం ప్రశ్నించారు. 'నా ఇంట్లో మనిషి దొంగతనం చేస్తే.. దొంగతనం కాకుండా పోతుందా?' అని కేసీఆర్ నిలదీశారు. పాత ఆర్టీసీని బతికి బట్టకట్టకుండా యూనియన్లే చేశాయని కేసీఆర్ మండిపడ్డారు. యూనియన్ల లీడర్లు అద్దె బస్సులను తొలగించాలని అంటున్నారని దాని అర్థం ఆర్టీసీని నిండా ముంచాలనా అని ప్రశ్నించారు. ఆర్టీసీ దగ్గర రూపాయిలేని పరిస్థితి ఉందన్న కేసీఆర్.. యూనియన్లు చేస్తున్న పని మహా నేరమన్నారు. సమ్మె చట్టవ్యతిరేకమని..ఆల్రెడీ ఎస్మా ఉందన్నారు. గొంతెమ్మ కోరికలతో, ఆర్టీసీని ఆగం చేసింది యూనియన్లేనని తేల్చి చెప్పారు. యూనియన్లు లేకుంటే ఆర్టీసీలోనూ భవిష్యత్తులో రూ.2 లక్షల బోనస్ తీసుకునేవారన్నారు. ఈ పరిణామాలు చూస్తుంటే ఇక వెయ్యిశాతం పాత ఆర్టీసీ ఉండదని, ఆర్టీసీ సమ్మెకు ఆర్టీసీ ముగింపే జవాబు అన్నారు. డబ్బులు లేవంటే హైకోర్టు కొడుతుందా..ఆస్తులుంటే అమ్మి కట్టాలని సూచిస్తుందని వ్యాఖ్యానిం చారు. టీఆర్ఎస్ అధికారం లోకి వచ్చాక ఆర్టీసీకి ఇప్పటికే రూ. 4,250 కోట్లు ఇచ్చా మని తెలిపారు. బ్జడెట్ లోనూ ఎక్కువ రూపా యలు కేటాయిస్తున్నాం.. అయినా ఆర్టీసీ బస్సులతో రోజూ రూ.3కోట్ల నష్టం వస్తుంద న్నారు. డ్యూటీ సమయంలో ట్రాఫిక్, ప్రయాణికులు ఎక్కేదగ్గర..దిగే దగ్గర కాన్త లేటే అవుతుందని.. దానికి ఎక్కువ సమయం శ్రమిస్తున్నామంటే ఎలా అన్నారు. ఓ గంట ఎక్కువ పని చేస్తే పోయిందేమిలేదన్నారు. అలా అనుకుంటే రైతు వ్యవసాయం చేయగలడా అని ఆర్టీసీ కార్మికులనుద్దేశించి కేసీఆర్ ప్రశ్నించారు.

ఆర్టీసీ కార్మికులకు చివరి వరకు అండగా ఉంటాం

హుజూర్‌నగర్‌లో ఓటుకు నాలుగువేలిచ్చారు
జీవన్ రెడ్డి విమర్శ

ఆదిలాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల సమ్మె 20వ రోజుకు చేరుకుంది. ఉట్నూర్ అంబేద్కర్ చౌక్‌లో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న ధర్నాలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, ఉట్నూర్ జడ్పీటీసీ సభ్యురాలు చారులత రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ... ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు వారికి అండగా ఉండి పోరాడతా మన్నారు. ఆర్టీసీని కేసీఆర్ తన బంధువులకు ప్రైవేటీకరణ పేరిట ఇచ్చేందుకు యత్నిస్తున్నారని జీవన్‌రెడ్డి ఆరోపించారు. హుజూర్ నగర్‌లో ఓటుకు నాలుగు వేలు ఇచ్చి గెలిచారన్న కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి, అక్కడ అందుకే టిఆర్ఎస్ పార్టీ విజయకేతనం ఎగురవేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యంత భారీ మెజారిటీతో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయం సాధించారు. ఇక టిఆర్ఎస్ పార్టీ సాధించిన విజయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. హుజూర్నగర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా భావించే నేపథ్యంలో పెద్ద ఎత్తున ప్రచారం చేసిన నేతలు విజయం తమదేనని భావించారు.

ప్రస్తుతం ఓటర్లు ఇచ్చిన తీర్పుకు షాక్ తిన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు టిఆర్ఎస్ పార్టీకి ఇది నిజమైన విజయం కాదని చెప్తున్న పరిస్థితి. హుజూర్ నగర్ ఉప ఎన్నికల్లో పద్మావతి ఉత్తమ్ కుమార్ ఓటమి పాలు కావడం కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకో లేకపోతోంది. సాక్షాత్తు టీపీసీసీ చీఫ్ గా ఉత్తమ్ కుమార్ రెడ్డి నగర్ ఉప ఎన్నికల బాధ్యతను భుజాల మీద వేసుకొని పనిచేసినప్పటికీ విజయ సాధించలేకపోవడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్పందిస్తున్నారు. ఓటుకు నాలుగు వేల రూపాయల చొప్పున పంచారు అని, ఓటర్లను ప్రలోభ పెట్టి సాధించిన విజయం విజయం గా లెక్కించడానికి వీల్లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కోట్లాది రూపాయలు కుమ్మరించి ఓటుకు 4000, 5000 రూపాయలు చొప్పున కొనుగోలు చేసి ఇప్పుడు ఓటర్లు తమ పక్షాన ఉన్నారని, గెలిచామని చెప్పుకోవడం ఒక గెలుపు కాదని, అందులో ఎలాంటి నైతికత లేదని ఆయన పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ గెలుపు గెలుపే కాదని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

హర్యానాలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు

మహారాష్ట్రంలో తమకూటమి ప్రభావం చూపింది
ఎన్నికల ఫలితాలపై ప్రియాంక గాంధీ

లక్నో,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): హర్యానాలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఉత్తర్ ప్రదేశ్ తూర్పు ప్రాంత ఇన్ ఛార్జి ప్రియాంకా గాంధీ చెప్పారు. మహారాష్ట్రలో కాంగ్రెస్-నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలు భారీగా ప్రభావాన్ని చూపాయని అన్నారు. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో కూడా తమ పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని చెప్పారు. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రియాంకా గాంధీ స్పందించారు. ఎన్నికల తాజా ఫలితాలు ఎలా ఉన్నాయనే విషయం తనకు తెలియదని, ఇంతకుముందే వార్తల ద్వారా తెలుసుకున్నానని అన్నారు. గురువారం ఆమె ఉత్తర్ ప్రదేశ్ లోని రాయబరేలీ పర్యటనకు వచ్చారు. ఉత్తర్ ప్రదేశ్ తూర్పు ప్రాంతం పరిధిలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఆమె విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ శ్రేణులతో సంప్రదింపులు నిర్వహి స్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పార్టీని క్యాడర్ ను సమాయాత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా రాయబరేలీకి వచ్చిన ప్రియాంకా గాంధీ వాద్రా స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రస్తుతం తన దృష్టి అంతా ఉత్తర్ ప్రదేశ్ మీదే ఉందని, మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గురించి పట్టించుకోలేదని అన్నారు. హర్యానాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామంటూ పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకొచ్చారని, ఇది మంచి పరిణామం అని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ బలహీనపడిందనడానికి ఈ ఎన్నికలే ఉదాహరణ అని చెప్పారు. మహారాష్ట్రలో బీజేపీ-శివసేన సంకీర్ణ కూటమి ఎక్కువ రోజులు అధికారంలో కొనసాగకపోవచ్చని ఆమె అంచనా వేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని, ఇదే ఊపును కొనసాగిస్తామని అన్నారు. తాజాగా ఫలితాలు, పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమౌతున్నాయని ప్రియాంకా గాంధీ చెప్పారు.

రైళ్లలోనూ ఉచిత వైఫై సౌకర్యం

పరిశీలనలో ఉందన్న పీయూష్ గోయల్

న్యూఢిల్లీ,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం భారతీయ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ భారతీయ రైళ్లలో ఉచిత వైఫై సర్వీసు అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. 2023 సంవత్సరం లోపు అన్ని భారతీయ రైళ్లలో ఉచిత వైఫై సర్వీసు అందుబాటులోకి వస్తుందని మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ప్రస్తుతం పీయూష్ గోయల్ స్వీడన్ పర్యటనలో ఉన్నారు. ప్రస్తుతం దేశంలోని 5,150 రైల్వే స్టేషన్లలో వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామని పీయూష్ గోయల్ అన్నారు. 2020 సంవత్సరం చివరినాటికి 6,500 స్టేషన్ లకు వైఫై సౌకర్యాన్ని విస్తరిస్తామని మంత్రి తెలిపారు. రైళ్లలో వైఫై సౌకర్యం కల్పించటం గురించి మంత్రి మాట్లాడుతూ రైళ్లలో వైఫై సేవలు చాలా సంక్లిష్టమైన స్టబెక్ట్ అని అన్నారు. విదేశీ పెట్టుబడులు, సాంకేతికత రైళ్లలో వైఫై పరికరాలు ఏర్పాటు చేయటానికి కావాలని అన్నారు. కొత్తగా టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని మంత్రి అన్నారు. నడుస్తున్న రైళ్లలో ప్రయాణికులకు వైఫై సేవలను అందించటం కొరకు చాలా పెట్టుబడి అవసరం అవుతుందని మంత్రి చెప్పారు. సిగ్నలింగ్ సిస్టమ్ ఇంకా మెరుగ్గా వైఫై ఫెసిలిటీ ద్వారా పని చేస్తుందని మంత్రి అన్నారు. రాబోయే నాలుగు, నాలుగున్నర సంవత్సరాలలో రైళ్లలో ఫ్రీ వైఫై సౌకర్యం కల్పించటానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. రైళ్లలో వైఫై సౌకర్యం కల్పిస్తే ప్రయాణికుల భద్రతకు కూడా చాలా ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు. ప్రతి ట్రైన్ కంపార్ట్‌మెంట్ లో సీసీటీవీలను అమర్చి ప్రయాణికులకు భద్రత కల్పిస్తామని మంత్రి చెప్పారు. సీసీటీవీల నుండి పోలీస్ స్టేషన్ కు నేరుగా లైవ్ ఫీడ్ వెళ్లేలా కూడా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందని తెలుస్తోంది. ప్రభుత్వం నడుస్తున్న రైళ్లలో వైఫై సౌకర్యం కల్పిస్తే రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది.

మహారాష్ట్రలో తగ్గిన బిజెపి ప్రభావం

అనేక ప్రాంతాల్లో గట్టి పోటీనిచ్చిన ఎన్సీపి
ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు

ముంబై,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ఓపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్‌కు కొంత భిన్నంగా మహారాష్ట్ర ఫలితాలు వెలువడాయి. 220 పైగా సీట్లు దక్కుతాయన్న ధీమాను వ్యక్తం చేసిన కాషాయ కూటమికి కొంత ఆశాభంగం జరిగింది. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు గురువారం తెరపడింది. మరోసారి ప్రజలు బీజేపీ, శివసేనల కూటమికే పట్టం కట్టారు. శివసేన, బీజేపీల కూటమికి 161 సీట్లతో పూర్తి మెజార్టీ లభించినా కాంగ్రెస్ కూటమి గట్టి పోటీ నిచ్చింది. గతంలో 122 సీట్లు దక్కించుకున్న బీజేపీ ఈ సారి కూడా అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ 18 స్థానాలు తగ్గాయి. దీంతో ఈ సారి 105 స్థానాలు దక్కించుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. మరోవైపు గతంలో 63 స్థానాలు దక్కించుకున్న శివసేన కూడా ఈ సారి ఏడు స్థానాలు తగ్గిపోయినప్పటికీ 56 స్థానాలతో ద్వితీయ స్థానంలో నిలిచింది. అయితే మహాకూటమికి చెందిన మొత్తం ఏడుగురు మంత్రులు పరాజయం పాలయ్యారు. పర్లీలో శిశు సంక్షేమ శాఖ మంత్రి పంకజా ముండే పరాజయం పాలయ్యారు. ఇక ఎన్సీపీ గతంలో కంటే అత్యధిక స్థానాలు గెలుచుకుని తన సత్తాను చాటుకుంది. ముంబైలోని 36 నియోజకవర్గాలలో ఎవరు విజయం సాధిస్తారనే విషయంపై ఉత్కంఠత కొనసాగింది. ఇక్కడి నుంచి కూడా బీజేపీ 16, శివసేన 14 స్థానాలను దక్కించుకోగా కాంగ్రెస్ నాలుగు, శివసేన ఒక స్థానంలో విజయం సాధించింది. మరోవైపు ఇతరులు ఒక స్థానాన్ని దక్కించుకున్నారు. ఇక్కడి నుంచి విజయం సాధించిన వారిలో ఆదిత్య ఠాక్రే, వర్షా గైక్వాడ్‌లతోపాటు పలువురు ప్రముఖులున్నారు. కాగా, ఎన్సీపీ సీనియర్ నాయకులు ఇతర పార్టీల బాట పట్టినా పార్టీ చీఫ్ శరద్‌పవార్ అన్నీ తానై నడిపించడం గమనార్హం. కాంగ్రెస్, ఎన్సీపీల కూటమికి గతంలోకంటే అధిక స్థానాలు లభించాయి. గతంలో కాంగ్రెస్‌కు 42 సీట్లు రాగా ఈసారి మూడు స్థానాలు పెరిగాయి. మరోవైపు ఎన్సీపీకి కూడా గతంలో 41 స్థానాలుండగా ఈ సారి 54 సీట్లను దక్కించుకుంది. ఇలా కాంగ్రెస్, ఎన్సీపీల కూటమికి 98 సీట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్, ఎన్సీపీలు గట్టిపోటీనిచ్చాయని తెలుస్తోంది. మహారాష్ట్రలో ప్రాంతాలవారిగా పరిశీలిస్తే పశ్చిమ మహారాష్ట్ర మినహా దాదాపు అన్ని ప్రాంతాల్లో బీజేపీ, శివసేనల కూటమి ఆధికృత సాధించింది. ఎన్సీపీ అధ్యక్షులు శరద్ పవార్‌కు అధిక పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలో అత్యధికంగా 27 స్థానాలు ఎన్సీపీకి దక్కాయి. కాంగ్రెస్ కూడా 11 స్థానాలు కైవసం చేసుకుంది. పశ్చిమ మహారాష్ట్రలో అత్యధికంగా 70 అసెంబ్లీ స్థానాలుండగా ఇక్కడ కాంగ్రెస్, ఎన్సీపీల కూటమికి 38 స్థానాలు, బీజేపీ 21, శివసేన ఐదు ఇలా కాషాయ కూటమికి 26 స్థానాలను దక్కించుకుంది. పశ్చిమ మహారాష్ట్రలో విజయం సాధించినవారిలో పృథ్వీరాజ్ చవాన్, అజిత్ పవార్, చంద్రకాంత్ పాటిల్ తదితర ప్రముఖులున్నారు. విదర్భలోని 62 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ, శివసేనల కూటమి 31 స్థానాలు దక్కించుకుంది. మరోవైపు కాంగ్రెస్, ఎన్సీపీల కూటమికి 23 స్థానాలు లభించాయి. విదర్భ నుంచి పోటీ చేసి విజయం సాధించిన వారిలో దేవేంద్ర ఫడ్నవిస్‌తోపాటు పలువురు ప్రముఖులున్నారు. మరాఠ్వాడాలో మొత్తం 46 స్థానాలుండగా ఇక్కడి నుంచి బీజేపీ శివసేన కూటమి 28 స్థానాలు గెలుచుకుని ప్రథమ స్థానంలో నిలిచాయి. మరోవైపు కాగ్రెస్, ఎన్సీపీలు 16 స్థానాలతో సరిపెట్టుకున్నాయి. ఇతరులకు రెండు స్థానాలు లభించాయి. మరాఠ్వాడాలో విజయం సాధించిన ప్రముఖులలో మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, ఎన్సీపీ నేత ధనంజయ్ ముండేతోపాటు పలువురు ప్రముఖులున్నారు. ఉత్తర మహారాష్ట్రలో బీజేపీ, శివసేనల కూటమికి 19 స్థానాలు లబించగా మరోవైపు కాంగ్రెస్; ఎన్సీపీల కూటమి 12 స్థానాలలో విజయం సాధించింది. మరోవైపు ఇక్కడి నుంచి ఆరుగురు ఇతరులు విజయం సాధించారు.కొంకణ్‌లో థానేతో కలిపి మొత్తం 39 స్థానాలున్నాయి. ఇక్కడ మాత్రం శివసేన తన పట్టును నిలుపుకుంది. కొంకణ్‌లో 16 స్థానాలతో శివసేన అతిపెద్ద పార్టీగా అవతరించింది. మరోవైపు బీజేపీకి 10 స్థానాలు ఇలా శివసేన, బీజేపీల కూటమికి 26 స్థానాలు లభించగా కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోయింది. అయితే ఎన్సీపీ మాత్రం ఐదు స్థానాల్లో విజయం సాధించింది. మరోవైపు ఇక్కడి నుంచి ఇతరులు ఏడుగురు విజయం సాధించడం విశేషం.

వైఎసఆర్ మూర్తి ఛారిటబులన ట్రస్టు అధినేత వైయస్ఆర్ మూర్తి-కామేశ్వరి ఆధ్వర్యంలో గానసభలో 10 మంది నృత్యకళాకారులతో జరిగిన ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ సమ్మోహనంగా సాగింది. డా॥ దీప్తి, స్మిత,సంగీత, శ్రీనిజ, సునయన, శ్రావణి, వినీత,అర్చన, అంజలి, జీ.రవి చేసిన సంప్రదాయ నృత్యాలు విశేషంగా అలరించాయి. వైఎస్ఆర్ మూర్తితో పాటు పద్మాకళ్యాణ్, రేణుకాప్రభాకర్, ఎస్.రామలింగేశ్వరరావ ్అతిథులుగా పాల్గొన్నారు. వైఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు చేస్తున్న సాంస్కృతిక సేవలను కొనియాడారు.

మార్కెట్‌పై టెలికమ్ తీర్పు ప్రభావం

బ్యాంకింగ్ రంగ షేర్లకు నష్టాలు

ముంబై,అక్టోబర్24(ఆర్ఎన్ఎ): : దేశీయ స్టాక్‌మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిసాయి. లాభనష్టాల మధ్య తీవ్ర ఒడిదుడుకులతో కొనసాగాయి. వరుసగా రెండో రోజూ దేశీయ సూచీలు లాభాల్లో ఆరంభమై, సెన్సెక్స్ 150 పాయింట్ల లాభంతో 39200 వేలకు, నిఫ్టీ 11600 ఎగువకు చేరాయి అదే స్థాయిలోమళ్లి నష్టపోయాయి. చివరకు సెన్సెక్స్ 38 పాయింట్లు నష్టంతో 39 వేల ఎగువన ముగిసింది. నిఫ్టీ 22 పాయింట్లు నష్టంతో 11600 దిగువన క్లోజ్ అయింది. రియాల్టీ స్టాక్స్ మినహా దాదాపు అన్ని రంగాల షేర్ల నష్టపోయాయి. ముఖ్యంగా టెలికాం కంపెనీలకు భారీ షాక్ ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో టెలికం షేర్లతోపాటు, వాటికి అప్పులిచ్చిన బ్యాంకింగ్ రంగ షేర్లు కూడా భారీ పతనాన్ని నమోదు చేశాయి. ఎస్‌బ్యాంకు, పీఎన్‌బీ, కోట్ మహీంద్ర బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఆర్‌బీఎల్, ఇండస్ ఇండ్‌బ్యాంకు తదితర బ్యాంకు లు భారతీయ టెలికాం కంపెనీలకు పెద్ద ఎత్తున రుణాలిచ్చాయి. భారతి ఇన్‌ఫ్రాటెల్, గ్రాసిం, ఎస్ బ్యాంకు, ఎస్‌బీఐ, గెయిల్, హెచ్‌డీఎఫ్‌సీ భారీగా నష్టపోయాయి. అనైతిక విధానాల ఆరోపణలతో ఇబ్బందుల్లోపడిన ఇన్ఫోసిస్‌పై సెబీకి దర్యాప్తు ప్రారంభించిందన్న వార్తలతో ఇన్వెస్టర్లు ఇన్ఫీ షేర్లలో అమ్మకాలకు దిగారు.

టెలికామ్ కంపెనీలకు సుప్రీం షాక్

కేంద్రానికి రూ.1.3లక్షల కోట్లు చెల్లించాలంటూ తీర్పు

న్యూఢిల్లీ,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): భారతీయ టెలికాం కంపెనీలకు అత్యున్నత న్యాయస్థానం బిగ్ షాక్ ఇచ్చింది. కేంద్రానికి రూ.1.3లక్షల కోట్లు చెల్లించాలంటూ తీర్పును ఇచ్చింది. టెలికమ్యూనికేషన్ విభాగం (డాట్) నిర్దేశిరచిన అడ్జెస్టెట్ గ్రాస్ రెవెన్యూ (ఏజీఆర్)ను సమర్థిస్తూ సుప్రీం గురువారం తీర్పు వెల్లడించింది. ఈ మేర డాట్ విధించిన జరిమానాను వడ్డీతో సహా చెల్లించాలంటూ సంచలన తీర్పు చెప్పింది. సుప్రీం కోర్టులో టెలికాం కంపెనీలు లేవనెత్తిన అంశాలు పనికిరావని కొట్టిపారేస్తూ వడ్డీతో సహా జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వానికి రూ.92,642 కోట్లను టెలికాం కంపెనీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో సగానికి పైగా ఎయిర్‌టెల్, వొడాఫోన్ నుంచే చెల్లించాల్సి ఉంది. డాట్ లెక్కల ప్రకారం 8 శాతం లైసెన్సు ఫీజుగా చెల్లించాలి. ఒక్కో సర్కిల్ లో 4.4 మెగాహెర్ట్జ్‌ల కంటే ఎక్కువ స్పెక్ట్రం ఉన్నా మార్కెట్ ధరలు చెల్లించాల్సిందే. మరోవైపు ఈ తీర్పుతో భారతి ఎయిర్‌టెల్ లిమిటెడ్ షేర్లు 4.9 శాతం, వోడాఫోన్ ఐడియా 13.3 శాతం పతనాన్ని చవిచూశాయి. న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా, ఏఏ నజీర్, ఎంఆర్‌షాలతోకూడిన సుప్రీం ధర్మాసనం ఈ తీర్పును ప్రకటించింది. ఏజీఆర్ ఫీజుపై 14 సంవత్సరాల నుంచి జరుగుతున్న న్యాయపోరాటంలో మొబైల్ ఆపరేటర్లు, ప్రభుత్వానికి మధ్య సమస్య పరిష్కారం చూపించింది.

ఆర్టీసీ బస్సులు నడిస్తే ఆదాయం ఏమైంది

కోదండరామ్ ప్రశ్న

హైదరాబాద్,అక్టోబర్25(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికులు సమ్మెచేస్తున్నా ప్రభుత్వం మాత్రం బస్సులు యథావిధిగా నడుస్తున్నాయని చెప్తోంది. బస్సులునడుస్తుంటే ఆ డబ్బులు ఎక్కడికి పోతున్నాయని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ప్రశ్నించారు.అనుభవం లేని తాత్కాలిక సిబ్బందితో నడిపిస్తుండడంతో రోజుకు మూడు నాలుగు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. ఆర్టీసీ లేనిదే సంతలు లేవు, యాత్రలు ఉండవని ఆయన పేర్కొన్నారు. డీజిల్ రేట్ల ప్రకారం ఛార్జీలు పెంచితే లాభాలు ఎందుకు రావని ఆయన ప్రశ్నించారు. డీజిల్ పన్నుతగ్గించి బస్‌పాస్ సబ్సిడీలను ప్రభుత్వమే భరించాలని అన్నారు. ఆరు నెలల నుంచి కార్మికుల పీఎఫ్ డబ్బును ప్రభుత్వమే వాడుకుంటోందని విమర్శించారు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న తీరు రాబోయే రోజుల్లో రాజ్యాంగ సంక్షోభానికి దారి తీస్తుందని కోదండరామ్ వ్యాఖ్యానించారు.

యువనేతల చేతుల్లో రెండు రాష్ట్రాల భవిష్యత్

**వారి కనుసన్